ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శనివారం 10 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 114 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

నోయిడా ఎయిర్‌పోర్టుకు
ప్రధాని మోదీ పేరు

యూపీ సర్కార్ సంచలన నిర్ణయం

2





2

ట్రంప్‌కు మరోసారి నిరాశ

దక్కని నోబెల్ శాంతి బహుమతి

భారత తమిళ మూలాలున్న నవీ పిళ్లేకు 2026 నోబెల్ శాంతి పురస్కారం

బస్సు బరిలో..
కారు గడిలో

ఆర్టీసీ గుర్తింపు సంఘం పోరులో బీఆర్ఎస్ మౌనం

తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఎన్నికల సందడి.. గత నిర్ణయమే గులాబీ పార్టీకి చిక్కుగా మారిందా?

కార్మిక విభాగం విజ్ఞప్తిపైనా స్పందన కరవు.. తెరవెనుక రాజకీయ లెక్కలపై ఆసక్తికర చర్చ

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి మొదలైంది. కార్మిక సంఘాలు పోటీకి సిద్ధ మవుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం తన వైఖరిని బహి రంగంగా వెల్లడించడం లేదు. ఒకప్పుడు సంస్థలో యూనియన్ల గుర్తింపు వ్యవస్థపై నిర్ణయం తీసుకున్న గులాబీ నాయకత్వం.. ఇప్పుడు అదే ఎన్నికల విషయంలో మౌనం పాటించడం రాజ కీయంగా ఆసక్తికరంగా మారింది. కార్మికుల పక్షాన నిలవాల్సిన సమయంలో వెనుకంజ వేయడానికి కార ణమేంటి? గత నిర్ణయమే ఇప్పుడు పార్టీకి ఇబ్బందిగా మారిందా?

హైదరాబాద్ బ్యూరో - సింగిడి



గత నిర్ణయమే గుదిబండా?

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు వ్యవస్థను రద్దు చేసింది. ఇప్పుడు తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఎన్నికలు రావడంతో అప్పటి నిర్ణయం మరోసారి చర్చకు వస్తోంది. కార్మిక సంఘాలకు మద్దతు ప్రకటిస్తే గత విధానంపై ప్రశ్నలు ఎదురవుతాయనే ఇబ్బంది.. దూరంగా ఉంటే కార్మిక వర్గంలో రాజకీయ పట్టు దెబ్బతింటుందనే ఆందోళన.. ఇలా పార్టీకి రెండు వైపులా సవాళ్లు కనిపిస్తున్నాయి.

విజ్ఞప్తికి స్పందన కరవు

ఎన్నికల విషయంలో పార్టీ వైఖరిని స్పష్టం చేయాలంటూ కార్మిక విభాగం విజ్ఞప్తి చేసినా.. నాయకత్వం నుంచి బహిరంగ ప్రకటన రాకపో వడం చర్చకు దారితీసింది. ఏ సంఘానికి మద్దతి వ్వాలి? ఎలాంటి పాత్ర పోషించాలి? అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో గులాబీ శ్రేణుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కార్మిక నేతల అభ్యర్థనపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసు కుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తెరవెనుక వేరే లెక్కలా?

నేరుగా ఎన్నికల బరిలోకి దిగకపోయినా.. ఓటర్లకు అంతర్గత సూచనలు ఇస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న సంఘానికి వ్యతిరేకంగా ఓటేయాలని కొందరు సూచిస్తున్నా రన్న టాక్ కూడా సాగుతోంది. బయటకు మౌనంగా కనిపిస్తున్నా.. తెరవెనుక ప్రభావం చూపించే వ్యూహం ఏదైనా ఉందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పార్టీ నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడంతో అసలు వైఖరిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

గడీ దాటని గులాబీ వ్యూహం

ఆర్టీసీ కార్మిక సంఘాలు తమ బలాన్ని నిరూ పించుకునేందుకు సిద్ధమవుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం బహిరంగంగా ముందుకు రావడం లేదు. గత నిర్ణయాల ప్రభావం పార్టీని వెనక్కి లాగుతోందా? కార్మికుల మద్దతు విషయంలో వ్యూహాత్మక మౌనం పాటిస్తోందా? లేక తెరవెనుక రాజకీయ లెక్కలు వేస్తోందా? అన్నది చర్చ నీయాంశంగా మారింది. కార్మికుల ఓట్ల కోసం సంఘాలు పోటీపడుతుంటే.. గులాబీ నాయకత్వం మాత్రం తన రాజకీయ లెక్కలను గడీలోనే తేల్చుకుంటోందన్న వ్యంగ్య వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



భద్రతా వలయంలో ఢిల్లీ!

అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా

- సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు
- ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు
- 57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు
- జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ
- పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికా రిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సింగిడి)

2

మెట్రోపై ఆంక్షలెందుకు?

సీజేపీ నిరసనల వేళ సుప్రీంకోర్టు ఫైర్!

ఈగను చంపేందుకు పెద్ద సుత్తి అవసరం లేదు

ఢిల్లీ సరిహద్దు రాష్ట్రాలకు
కేంద్ర హోంశాఖ కీలక లేఖ

2



జంతర్ మంతర్ వద్ద సీజేపీ ధర్నా నేపథ్యంలో కేంద్ర హోంశాఖ తీవ్రంగా స్పందించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ముందస్తు చర్యగా ఢిల్లీ సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం ప్రత్యేకంగా లేఖ రాసింది. ఈ క్రమంలో సరిహ ద్దుల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, పరిస్థితులను నిశితంగా పరిశీలించాలని ఆదేశిం చింది. రాజధాని పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు సరిహద్దు రాష్ట్రాల పోలీసులు తీవ్ర నిఘా ఉంచాలని హోంశాఖ సూచించింది. ముఖ్యంగా ఆకతాయిలు, అరాచక శక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నా లను ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలని స్పష్టం చేసింది.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సింగిడి)



2

వర్షాభావ పరిస్థితులపై 12న
సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

-హైదరాబాద్, అక్టోబర్ 9 (సింగిడి)



కిటకిటలాడుతున్న
బస్టాండ్‌లు

దసరా సందర్భంగా సొంతూళ్లకు ప్రజలు

హైదరాబాద్‌లో పలు బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకి టలాడుతున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో నగరవా సులు తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఫలితంగా వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారితో బస్టాండ్‌లలో రద్దీ నెలకొంది.

-హైదరాబాద్, అక్టోబర్ 9 (సింగిడి)

2

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు
నెలలోగా పరిష్కారం

సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి

దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి

రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ సమగ్ర భూ సర్వే చేపట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమైంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని పలు గ్రామాల్లో చేపట్టిన భూసర్వే ప్రక్రియను ఈ ఏడాది నవంబర్ లోపు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోయే సమగ్ర భూ సర్వేను ఏడాదిన్నర లోపు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. సమగ్ర రీ భూసర్వేపై శుక్రవారం సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికా రులతో భూసర్వే పురోగతిపై మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వేకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ క్రమంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, సర్వేలో వేగం పెంచుతామన్నారు. అధికార యంత్రాంగం కూడా అత్యంత బాధ్యతతో తమ విధులు నిర్వర్తించా లన్నారు. భూసర్వేను నిరంతరం పర్య వేక్షించేందుకు ఏడు జోన్లకు రెవెన్యూ, సర్వే డిపార్ట్‌మెంట్ల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారు లను నియమించామన్నారు.

-హైదరాబాద్, అక్టోబర్ 9 (సింగిడి)





నందిగ్రామ్‌లో బీజేపీ
రికార్డు విజయం

2

1.22 లక్షల ఓట్ల భారీ మెజారిటీ!

హసిరాణి రథ్‌కు 1,64,427 ఓట్లు

కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు

మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పోటీకి దూరం

ఫలితంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై
చంద్రబాబు స్పందన

స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు అండగా ఉంటామన్న చంద్రబాబు



స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదు రుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వే షన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమే నని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు.

2

-అమరావతి, అక్టోబర్ 9 (సింగిడి)

దళితున్ననే అవమానించారు

మాధవరావు, తన అనుచరులపై చర్యలు తీసుకోండి... జర్నలిస్టు శంకర్ కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు

(కరీంనగర్ - సింగిడి)

తాను దళితుడిని అనే చిన్నచూపుతోనే బహిరం గంగా తనను అవమానించారని, సామా జిక గౌరవానికి భంగం కలిగించారని ఆరోపిస్తూ 'ప్రభాతనవ సింగిడి' దినపత్రిక కరీంనగర్ బ్యూరో రాపాక శంకర్ పోలీసులను ఆశ్రయిం చారు. తనను అవమానించిన దేవరనేని మాధ వరావుతో పాటు మరి కొందరి పై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టంతో పాటు ఇతర వర్తించే చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో శంకర్ ఈవిధంగా పేర్కొన్నారు.అక్టోబర్ 5, 6 తేదీల్లో తాను పనిచేస్తున్న దినపత్రికలో ప్రచు రించిన రెండు వార్తా కథనాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గోదావరిఖని ప్రెస్ క్లబ్‌కు చెందిన దేవరనేని మాధవరావు, మరికొందరు రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లి తనపై ఫిర్యాదు చేసినట్లు శంకర్ పేర్కొన్నారు.అనం తరం కమిషనరేట్ ప్రాంగణంలో జరిగిన సమా



వేశంలో తనను, తన పత్రికను ఉద్దేశించి మీడియా కెమెరాల సమక్షంలో 'క్రిమినల్స్', 'విచ్ఛిన్నకర శక్తులు', 'దోపిడీదారులు' వంటి పదాలతో కించపరిచారని ఆరోపించారు.తాను షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిననే విషయం తెలిసి కూడా కుల గుర్తింపును దృష్టిలో పెట్టుకుని అవమానించేలా వ్యవహరించారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ ఘటనను వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో తన వ్యక్తిగత ప్రతిష్ఠ, సామాజిక గౌరవానికి భంగం కలిగిందని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఘటనకు సంబంధించిన వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించాలని కోరారు. కాగా ఈ మీడియా సమావేశ సమయంలో అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ఇతర ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయడంతో పాటు డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని కోరారు. తనకు, తన కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో బెదిరింపులు, వేధింపులు లేదా ప్రతీకార చర్యలు జరగకుండా రక్షణ కల్పించాలని, ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఏసీపీని అభ్యర్థించారు.



తమిళనాడులో
విజయ్‌కు బూస్ట్

రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

మదురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం

ధారాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ

2



భద్రతా వలయంలో ఢిల్లీ!

గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

నోయిడా ఎయిర్‌పోర్టుకు
ప్రధాని మోదీ పేరు..

యూపీ సర్కార్ సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సింగిడి)

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నోయిడాలోని జేవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును నరేంద్ర మోదీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, నోయిడా–జేవార్ గా మారుస్తూ యోగి సర్కార్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన తీర్మానానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. లక్నోలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారికంగా ప్రకటించారు. ఈ విమానాశ్రయం భవిష్యత్తులో ఉత్తరప్రదేశ్‌లోనే అతిపెద్ద విమానాశ్రయంగానే కాకుండా, దేశంలోనే ఒక ప్రధాన ఏవియేషన్ హబ్‌గా అవతరించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వ అధినేతగా 25 సంవత్సరాల నిరంతర ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా, రూ. 11,282 కోట్ల వ్యయంతో ఈ ఎయిర్‌పోర్టును నిర్మించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత దేశంలోనే ఇది రెండో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం. వైడ్–బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ల్యాండింగ్‌కు అనుకూలం 3,900 మీటర్ల పొడవైన రన్‌వేతో ఈ ఎయిర్‌పోర్టును అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. స్విస్ సంస్థ జూరిచ్ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ AGకి చెందిన అనుబంధ సంస్థ యమునా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ దీనిని నిర్మించింది. ఈ ఏడాది మార్చి 28న ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ ఎయిర్‌పోర్టును ప్రారంభించారు. జూన్ 15న కమర్షియల్ విమానాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు
నెలలోగా పరిష్కారం

సర్వే విషయంలో ప్రజల స్పందనను పరిగణనలోకి తీసుకుని అందుకనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.
సర్వే తొలి దశలో భాగంగా నక్షా లేని 365 గ్రామాల్లో.. అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున రీసర్వే ముమ్మరంగా సాగుతుందన్నారు. ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. మొదటి దశ సర్వేను నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ–సర్వే జరగాలని మంత్రి స్పష్టం చేశారు.

15 రోజులకోసారి స్వయంగా సమీక్షిస్తా

రీ–సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రీ–సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు

రీ–సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు.

ఎర్రవల్లిలో సర్వే కోసం మరోసారి నోటీసులు

శుక్రవారం సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని, సర్వే కోసం మరోసారి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు చేతులు మారాయి. వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.
ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమరవీరులను గుర్తించి వాళ్లకు న్యాయం చేస్తామన్నారు. ఎర్రవల్లిలో కూడా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామన్నారు.

వర్షాభావ పరిస్థితులపై 12న
సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం



ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

మెట్రోపై ఆంక్షలెందుకు?

సీజేపీ నిరసనల వేళ సుప్రీంకోర్టు ఫైర్!
ఈగను చంపేందుకు పెద్ద సుత్తి అవసరం లేదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సింగిడి)

దిల్లీలో మెట్రో స్టేషన్లు, రైళ్ల సేవలపై ఆంక్షలు విధించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. భద్రతా చర్యలు అవసరమే అయినా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని స్పష్టం చేసింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం తలపెట్టిన నిరసన దృష్ట్యా దిల్లీ మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మూసివేతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆంక్షల వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెల్లడించింది. ఒక ఈగను చంపడానికి భారీ సుత్తిని ఉపయోగించలేమంటూ అభిప్రాయపడింది. భద్రత పేరుతో నగరంలో రాకపోకలన్నీ నిలిపివేయడం సరికాదని స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

ప్రజా రవాణా ఆపేస్తే ఎలా?

దిల్లీలో అక్టోబర్ 10న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన చేపట్టనున్న నేపథ్యంలో అధికారులు భారీగా ఆంక్షలు విధించారు. నిరసనకారులు సున్నిత ప్రాంతాల వైపు వెళ్లకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పలు మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయడంతో పాటు కొన్ని రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ నిర్ణయాలను సవాలు చేస్తూ సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ఉద్యోగాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. యువత, వృద్ధులు సహా అనేక మంది ప్రజా రవాణాపైనే ఆధారపడతారని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రజలకు కనీస రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. మూసివేసిన మెట్రో స్టేషన్ల సంఖ్యను తగ్గించాలని



ప్రభుత్వాన్ని కోరింది.

నిరసన శాంతియుతంగా సాగనివ్వాలి

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రైళ్లను రద్దు చేయడం, మెట్రో స్టేషన్లను మూసివేయడం వల్ల ప్రజలు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇది శాంతియుత నిరసన మాత్రమేనని, ఇలాంటి పరిస్థితుల్లో రవాణా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయడం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, తమ ఆందోళన నిరసనకారుల గురించి మాత్రమే కాదని, దిల్లీకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది ప్రయాణికుల గురించి కూడా అని స్పష్టం చేశారు.
గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, తూర్పు దిల్లీ, దక్షిణ దిల్లీ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వచ్చే ప్రజలకు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. భద్రతా చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉందని ధర్మాసనం అంగీకరించింది. అయితే, ఆంక్షల పేరుతో అన్ని రకాల రవాణాను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని స్పష్టం చేసింది. ప్రతి ఒక్కరికీ సొంత కారు లేదా ప్రైవేటు వాహనం ఉండదని, చాలామంది ప్రజా రవాణాపైనే ఆధారపడతారని గుర్తు చేసింది.

'రైళ్ల సంఖ్య తగ్గించొచ్చు- పూర్తిగా ఆపొద్దు'

సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర ప్రభుత్వ తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత జులైలో సీజేపీ నిర్వహించిన నిరసన సందర్భంగా హింస చోటుచేసుకున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. అయితే, భద్రతా చర్యలు అవసరమైన స్థాయిలోనే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మెట్రో రైళ్ల రాకపోకల సంఖ్యను తగ్గించవచ్చని, కానీ సేవలను పూర్తిగా నిలిపివేయకూడదని సూచించింది. రహదారులపై విధించిన ఆంక్షలను కూడా మరోసారి పరిశీలించాలని ఆదేశించింది. ఏయే ప్రాంతాల్లో ఆంక్షలు అవసరం, ఎక్కడ వాటిని సడలించవచ్చనే అంశంపై సమీక్ష జరపాలని పేర్కొంది.

57 మెట్రో స్టేషన్లపై ఆంక్షలు

సీజేపీ నిరసన నేపథ్యంలో దిల్లీలోని 57 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు ప్రకటించారు. అక్టోబర్ 9, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి సంబంధిత స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ స్టేషన్ల మీదుగా వెళ్లే మెట్రో రైళ్ల రాకపోకల మధ్య వ్యవధిని కూడా పెంచే అవకాశం ఉందని వెల్లడించారు. మరోవైపు, రైల్వే సేవలపైనా నిరసన ప్రభావం పడింది. న్యూదిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు చేరుకోవాల్సిన పలు రైళ్లను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. నిరసన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడటం అధికారుల బాధ్యతే అయినా అదే సమయంలో సాధారణ ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భద్రతకు, ప్రజల రోజువారీ అవసరాలకు మధ్య సమతుల్యత పాటిస్తూ ఆంక్షలు విధించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ట్రంప్‌కు మరోసారి నిరాశ..

దక్కని నోబెల్ శాంతి బహుమతి
భారత తమిళ మూలాలున్న నవీ పిళ్లేకు 2026 నోబెల్ శాంతి పురస్కారం
భారత్-పాక్ మధ్య శాంతికి కృషి చేశారని ట్రంప్‌ను ప్రతిపాదించిన పాకిస్థాన్
ట్రంప్ వాదనలను తీవ్రంగా ఖండిస్తూ వస్తున్న భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (సింగిడి)



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరోసారి నోబెల్ శాంతి బహుమతి విషయంలో నిరాశే ఎదురైంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గట్టిగా ప్రచారం చేసినప్పటికీ, ఈ పురస్కారం ఆయనకు దక్కలేదు. 2026 సంవత్సరానికి గాను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఐక్యరాజ్యసమితి మాజీ మానవ హక్కుల చీఫ్, భారత తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవేత్త నవనీతం 'నవీ' పిళ్లేను వరించింది. పురస్కారం ప్రకటించడానికి కొన్ని గంటల ముందు, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్' వేదికగా ట్రంప్‌కు మద్దతు తెలిపారు. "దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పడంలో ట్రంప్ చారిత్రక పాత్ర పోషించారు. భారత్–పాకిస్థాన్‌లను యుద్ధం అంచుల నుంచి వెనక్కి తీసుకువచ్చి కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో సహాయపడ్డారు. ఆయన సేవలకు ఈసారైనా తగిన గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.
అయితే, ఈ వాదనను భారత్ మొదటి నుంచి తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. 2025 మే నెలలో కశ్మీర్‌లో ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో ఏ మూడో వ్యక్తి ప్రమేయం లేదని ఢిల్లీ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని, మధ్యవర్తిత్వాన్ని ఎప్పటికీ అంగీకరించబోమని ప్రధాని మోదీ ట్రంప్‌తో చెప్పినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. అయినప్పటికీ, భారత్–పాక్ మధ్య శాంతిని తానే నెలకొల్పానని ట్రంప్ 2025 మే నుంచి ఇప్పటివరకు దాదాపు 80 సార్లు ప్రకటించుకున్నారు. మరోవైపు, 2026 నోబెల్ శాంతి పురస్కార విజేతగా నిలిచిన నవీ పిళ్లే (85) అంతర్జాతీయ న్యాయవాదిగా, మానవ హక్కుల పరిరక్షకురాలిగా సుప్రసిద్ధులు. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన నెల్సన్ మండేలా వంటి ఎందరో కార్యకర్తల తరఫున ఆమె న్యాయవాదిగా పనిచేశారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) న్యాయమూర్తిగా, ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా ఆమె అందించిన సేవలను నోబెల్ కమిటీ ప్రశంసించింది. శాంతి, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణకు చేసిన కృషికి గాను ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నార్వేలోని ఓస్లోలో కమిటీ ఛైర్మన్ ప్రకటించారు. ఈ అవార్డు కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్ల (సుమారు 1.2 మిలియన్ డాలర్లు/రూ.11.62 కోట్లు) నగదు బహుమతిని డిసెంబర్ 10న అందజేస్తారు.



నందిగ్రామ్‌లో బీజేపీ
రికార్డు విజయం

కోల్‌కతా, అక్టోబర్ 9 (సింగిడి)

పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీ చరిత్ర సృష్టించింది. ఆ పార్టీ అభ్యర్థి హసిరాణి రథ్ ఏకంగా 1,22,753 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 1967 నుంచి నందిగ్రామ్‌లో గెలిచిన అభ్యర్థుల మెజారిటీల్లో ఇదే అత్యధికం. ఈ ఫలితంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. హసిరాణి రథ్‌కు 1,64,427 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. సీపీఐ అభ్యర్థి శాంతి గోపాల్ గిరికి 5,779 ఓట్లు వచ్చాయి. ఆలిండియా సెక్యులర్ ఫ్రంట్ అభ్యర్థి అలీ మహమ్మద్ సబీర్ మీరాజ్ ఖాన్ 1,607 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్‌కు కేవలం 853 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉంది. ఆ పార్టీ అభ్యర్థి సంచిత ప్రధాన్ డే చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మమతా బెనర్జీ ప్రకటించారు. అయినప్పటికీ బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. నందిగ్రామ్‌లో గతంలో అత్యధిక మెజారిటీ రికార్డు ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి పేరిట ఉండేది. 2016లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 81,230 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి బీజేపీ అభ్యర్థి అంతకంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తారని తాను ముందే అంచనా వేసినట్లు సువేందు అధికారి తెలిపారు. మైనారిటీ ఓట్లలోనూ బీజేపీ అభ్యర్థికి మద్దతు లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి సువేందు అధికారి కేవలం 9,665 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అయితే, భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలిచిన ఆయన నందిగ్రామ్‌ను వదులుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. హసిరాణి రథ్.. సువేందు అధికారి మాజీ వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ తల్లి. చంద్రనాథ్ ఈ ఏడాది మే 6న మాధ్యమ్‌గ్రామ్‌లో హత్యకు గురయ్యారు.

తమిళనాడులో
విజయ్‌కు బూస్ట్

చెన్నయ్, అక్టోబర్ 9 (సింగిడి)

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది. ధారాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉప ఎన్నికలు రెండు స్థానాలకే పరిమితమైనా, విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.





బీసీ రిజర్వేషన్లపై
సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన

న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.



కిటకిటలాడుతున్న
బస్టాండ్‌లు

హైదరాబాద్‌లో పలు బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో నగరవాసులు తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఫలితంగా వివిధ జిల్లాల తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారితో బస్టాండ్‌లలో రద్దీ నెలకొంది. పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇవాళ్టి నుంచి ఈనెల 18న తేదీ వరకు వివిధ జిల్లాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు ప్రయాణికుల తిరుగు ప్రయాణం కోసం బస్సులను ఏర్పాటు చేయనుంది. దసరాకు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. తెలంగాణలో ఎంగిలిపూల బతుకమ్మతో రేపటి నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానుంది. ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మ వేడుకలతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ప్రభుత్వ పరంగానూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఇటీవల మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం తరపున 18న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య వేడుకలు జరగనున్నాయి.

రాహుల్ గాంధీ దీక్షకు మద్దతుగా
2వ రోజు కొనసాగుతున్న జగ్గారెడ్డి దీక్ష

మద్దతు తెలుపుతున్న పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు

దీక్షలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొందెం వీరన్న





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 9(సింగిడి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కొనసాగిస్తున్న దీక్ష గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, జెసి వేణుగోపాల్ చేపట్టిన పోరాటం కు మద్దతు తెలుపుతూ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షను కొనసాగిస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో చేస్తున్న దీక్ష కొనసాగినంత కాలం ఇక్కడ కూడా దీక్ష కొనసాగుతుందని జగ్గారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ తోటి కమిషనర్లను కూడా లెక్కచేయకుండా అభ్యంతరం తెలిపిన పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బిజెపి కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలకు బిజెపి ప్రభుత్వం సహకారం ఉందని దుయ్యబట్టారు. ప్రజల ఓటు హక్కును గుంజుకుని వ్యవహార శైలి ప్రజాస్వామ్యంలో ఉండకూడదని ఆయన హితవు పలికారు. అయితే జగ్గారెడ్డి దీక్ష శిబిరానికి గురువారం పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అలాగే దీక్ష శిబిరానికి భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొందెం వీరన్న వచ్చి మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షకు పలువురు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తుగా వచ్చి మద్దతు తెలుపుతున్నారు.

అభివృద్ధి పథకాల రూపకల్పనలో మహిళలకు
పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తున్నాం

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 9(సింగిడి): మహిళలే ప్రాధాన్యతగా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వైశ్య సంక్షేమ సంఘ భవనంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో గల 140 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ చీరలను రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పనలో మహిళలకు పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని ఋణాలు, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాలతోపాటు, మహిళల వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు పెట్రోల్ బంక్ లను కూడా కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఆదేశాలు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో చేపట్టిన బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా రాష్ట్రంలో 20 లక్షల బ్రేక్ ఫాస్ట్ లను ప్రతిరోజు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ బ్రేక్ ఫాస్ట్ వలన విద్యార్థులు సంతోషంగా ఉన్నారని అన్నారు. పేదలెవరు గుడిసెలలో నివాసం ఉండరాదు అనేది ప్రభుత్వం లక్ష్యమని దానిలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తీసుకురావడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కన్నా సిద్దిపేట జిల్లా లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముందు వరుసలో ఉందని అన్నారు. ఒక సిద్దిపేట నియోజకవర్గంలోనే 3500 ఇండ్లకు తాను 2500 నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. పేదలు కడుపునిండా భోజనం చేయాలని ఉద్దేశంతో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకం, కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను తీసుకు వచ్చిందని దానితో వేలాది మంది పేద విద్యార్థులు నాణ్యమైన ఉచిత విద్యను పొందుతున్నారని అన్నారు. దుబ్బాకలో 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు ను ఏర్పాటు చేయబోతున్నామని దానిలో 2500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా నాణ్యతను పెంచేందుకు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యం ఎల్ నీనో ప్రభావం రాష్ట్రంపై అధికంగా ఉండబోతుందని, కరెంట్ వినియోగం పెరిగిందని, వచ్చే జూన్ వరకు వర్షాలు పడే అవకాశాలు లేవని, రిజర్వాయర్ లలో ఉన్న నీటిని త్రాగునీరు కోసం ఉపయోగించడం జరుగుతుందని ప్రభుత్వ సూచనలు, ఆదేశాలను పాటిస్తూ ఎల్ నినోను ఎదుర్కొనేందుకు మానసికంగా ప్రజలు సిద్ధం కావాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ పథకం లబ్ధిదారులకు, ఇందిరమ్మ చీరలను అందుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపా రు. జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం తదితర అన్ని ప్రభుత్వ కార్యక్ర మాల్లో మహిళలు భాగస్వాములై ప్రభుత్వ లబ్ధిదా రుల్లో మహిళలు అగ్రస్థానంలో ఉన్నారని మిగతా అన్ని ప్రభుత్వ పథకాలను మహిళలు తప్పకుండా ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో పద్మశాలి రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, సిద్దిపేట ఆర్డీవో సదానందం, సిద్ధిత నియోజకవర్గ ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్ర తినిధులు, రెవెన్యూ మున్సిపల్ సిబ్బంది, మహిళ లు పాల్గొన్నారు.

కేశంపల్లి తండాలో పంటల వైవిధ్యీకరణపై
నిపుణులచేత రైతులకు అవగాహన



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9(సింగిడి): నవాబుపేట మండలంలోని కేశంపల్లి తండా మరియు అత్తాపూర్ గ్రామంలో టీ ఎస్ పీ , ఎస్ సీ ఎస్ పీ కార్యక్రమాల్లో భాగంగా రైతులకు పంటల వైవిధ్యీకరణ, నూనెగింజల సాగు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వికారాబాద్ టీ ఆర్ వీ కే, తాండూర్ ఏ ఆర్ ఎస్ మరియుఐ సీ ఏ ఆర్, వో ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీ ఆర్ వీ కే వికారాబాద్ కోఆర్డినేటర్ డా. ఉమారాజశేఖర్, ఏ ఆర్ ఎస్ తాండూర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్, హెడ్ డా. సి. సుధారాణి, నవాబుపేట మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఐ సీ ఏ ఆర్ II వో ఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఆర్.డి. ప్రసాద్, తాండూర్ సైంటిస్ట్ మాణిక్య మినీ, అత్తాపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఏ ఎం సీ చైర్మన్ గీతా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీ ఆర్ వీ కే వికారాబాద్ కోఆర్డినేటర్ డా. ఉమారాజశేఖర్ మాట్లాడుతూ వర్షాధార ప్రాంతాల్లో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణను చేపట్టాలని సూచించారు. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో కుసుమ వంటి నూనెగింజల పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఏ ఆర్ ఎస్ తాండూర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డా. సి. సుధారాణి మాట్లాడుతూ రైతులు నూనెగింజల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా పంట దిగుబడులు, నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. నవాబుపేట మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్నటీ ఎస్ పీ,ఎస్ సీ ఎస్ పీ కార్యక్రమాల ద్వారా అందుతున్న సాంకేతిక సహాయం, విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల ఎంపికలో స్థానిక వాతావరణం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఈ నేపథ్యంలో 130 మంది రైతులకు కుసుమ విత్తనాల పంపిణీ చేశారు.

వ్యవసాయ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



కొడంగల్, అక్టోబర్ 9(సింగిడి): కోడంగల్ మండలం ఎర్రన్‌పల్లి గ్రామంలో 62 ఎకరాలలో నిర్మాణం జరుగుతున్నజయ శంకర వ్యవసాయ యనివర్సిటీ కళాశాల కు అనుబంధ వ్యవసాయ కళాశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం ట్రైనె కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలలు, పరిపాలనా భవనా లు తదితర సౌకర్యాలపై అధికారు లతో కలెక్టర్ చర్చించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవే క్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలోకడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ సుధాకర్ సంబంధిత శాఖల అధి కారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన
మధుసూధన్ రెడ్డి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9(సింగిడి): కుత్బుల్లాపూర్ డివిజన్ మధుసూధన్ రెడ్డి నగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు ఏవి. చిన్నయ్య, సలహాదారులు రఘుమా రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రసాద్ రావు, మల్లయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లా రావు, మధుసూదన్, సంజయ్ కుమార్, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ రెడ్డి, శేఖర్ గౌడ్, శ్రీరామ్, నరసింహ రెడ్డి, శ్రీరామయ్య, ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి, కోశాధికారి డొక్కు శ్రీనివాస్ రావు, ఇతర కమిటీ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పై దుష్ప్రచారం తగదు

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారినిఉపేక్షించొద్దు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 9 (సింగిడి): ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని బయలుదేరుతున్నసమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని తన కూతురులాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయ తతో మాట్లాడితే సంస్కారం లేని నాయకులు ఎమ్మెల్యే పైన సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శ చేస్తే హుందాగా ఉండాలని ఇట్లా ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు.ప్రతీ మహిళను తన తల్లిలా చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అత్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారని అన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు కుళ్ళుతో విమర్శించడానికి ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచి దికాదని మరోసారి ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయ కుండా కఠినంగా శిక్షించాలని అన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్



సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 9(సింగిడి): జిల్లాలోని ములుగు మండలం క్షీరసాగర్ గ్రామ రైతు నరేష్ రెడ్డిరెండున్నర ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం రోజున క్షేత్రస్థాయిలో సందర్శించారు. క్షీరసాగర్ గ్రామానికి చెందిన నరేష్ రెడ్డి దంపతులు ఇరువురు సాఫ్ట్వేర్ ఉద్యోగులు వారికి వ్యవసాయం మీద ఉన్న మక్కువతో పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో రెండున్నర ఎకరాలలో రకరకాల వడ్లు, పండ్ల, కూరగాయలు పండించడం జరుగుతుందనిప్రతి వారం సెలవు రోజున కుటుంబం తో ఇక్కడికి వస్తారని గ్రామస్తులు తెలిపారు. సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వివిధ పంటలను, ప్రకృతి ఆధారిత ఎరువుల వినియోగాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూసారం పరిరక్షణతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తుందని ప్రతి రైతు సేంద్రీయ వ్యవసాయ చెయ్యాలని తెలిపారు.రైతు నరేష్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడుతూ చాలా బాగా వ్యవసాయం చేస్తున్నారని, సేంద్రీయ వ్యవసాయం చెయ్యాలనే వారికి మీరొక ఆదర్శంగా నిలుస్తారని అభినందించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్, స్థానిక సర్పంచ్ బాలరెడ్డి, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొలను శ్రీనివాస్ రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితం

ప్రజల సంక్షేమమే జీవిత లక్ష్యం

ఘనంగా కొలను శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించిన అభిమానులు, ఆత్మీయులు









కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9(సింగిడి): (నూతన సంవత్సర క్యాలెండర్ ఫుల్ పేజీ యాడ్ ఇచ్చింద్రు ఈ వార్త, ఫోటోలు తప్పక వాడుకోగలరు) నిజాంపేట్ ప్రజల ఆత్మీయ నాయకులు, ప్రజాసేవకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, అభిమానులు, స్థానిక పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. కె ఎస్ ఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ పరిధిలోని వివిధ డివిజన్లలో భక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతను చాటిచెప్పే పలు కార్యక్రమాలు స్వచ్ఛందంగా అభిమానులు నిర్వహించారు. అందులో భాగంగా శివాలయం, దుర్గామాత దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కొలన్ శ్రీనివాస్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. విద్యే సమాజ అభివృద్ధికి పునాది అనే సంకల్పంతో పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి, వారి విద్యాభివృద్ధికి చేయూత అందించారు. ఆర్ జి కే , శివాలయం,నవ్య బేకరీ, 191, అంగన్వాడీ స్కూల్, ఆర్ జీకే ఆటో స్టాండ్, ఇందిరమ్మకాలనీ ఫేస్ 2తదిత ర ప్రాంతాల్లో ప్రజల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి, ప్రజలతో మమేకమై ఈ ప్రత్యేక దినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలను కొలన్ శ్రీనివాస్ రెడ్డి తన యుడు కొలన్ రీత్విక్ రెడ్డి, బండారి లేజెట్ కాంగ్రెస్ అధ్యక్షులు వారగని వాసు, మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

మత్తుకు బానిసవుతున్న యువత

46 గ్రాముల గంజాయి స్వాధీనం

ఒకరు అరెస్ట్



కొల్చారం , అక్టోబర్ 9(సింగిడి): మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారంలో బుధవారం నాడు సుమారు 17:30 గంటలకు, మండలం లోని అప్పాజీపల్లి గ్రామ శివారులో కొల్చారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, నంబర్ ప్లేట్ లేని బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడిని విచారించగా తన పేరు తెనుగు సాయికుమార్, తండ్రి ప్రభాకర్, వయస్సు 19 సంవత్సరాలు, వృత్తి కూలిపని, నివాసం కొల్చారం గ్రామం మండలం అని తెలిపాడు. పంచుల సమక్షంలో అతని బైక్ ట్యాంక్ కవర్‌ను తనిఖీ చేయగా, అందులో 46 గ్రాముల ఎండు గంజాయి, ఒక Realme సెల్‌ఫోన్ లభించాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2,300/-. గంజాయి, సెల్‌ఫోన్ మరియు Bajaj Platina బైక్ (Chassis No. MD2A76AX3PWM04538) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు 06.10.2026న నారాయణఖేడ్‌కు చెందిన నవీన్ అనే వ్యక్తి వద్ద నుండి 50 గ్రాముల గంజాయిని రూ. 1,000/-కు కొనుగోలు చేసి, విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు వెల్లడించాడు. సమాచారం అందిన వెంటనే Gణలో నమోదు చేసి, NDPS Act zdక్షన్ 42(2) ప్రకారం ఉన్నతాధి కారులకు సమాచారం అందించడంతో పాటు, పంచుల సమక్షంలో చట్టపరమైన విధానాలను పాటిస్తూ స్వాధీనం చేపట్టారు. క్లూస్ టీమ్ ద్వారా స్వాధీనం ప్రక్రియకు సంబంధించిన ఫోటోలు మరి యు వీడియోలు సేకరించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను పోలీస్ స్టేషన్‌కు తరలించి మాల్ఖానా రిజిస్టర్‌లో నమోదు చేసి, ప్రాపర్టీ రూమ్‌లో భద్రపరి చారు. నిందితుడిపై NDPS Ac ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

కొల్లూరు పెద్ద చెరువుకు మురుగు ముప్పు!

చెరువులోకి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ డ్రైనేజీ వ్యర్థాలు

నిర్వహణ లేక తుప్పుపట్టిన ఎస్టీపీ యంత్రాలు

దుర్వాసన, దోమలతో ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం

పట్టించుకోని అధికారులు.. స్థానికుల ఆగ్రహం







రామచంద్రాపురం, అక్టోబర్ 9(సింగిడి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధి లోని రామచంద్రాపురం మండల పరిధిలోని కొల్లూ రు డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నుంచి వెలువడుతున్న మురుగు నీరు నేరుగా కొల్లూరు పెద్ద చెరువులోకి చేరుతుండటంతో చెరువు తీవ్రంగా కలుషితమవుతోంది. మురుగు నీటిని శుద్ధి చేసేందుకు కాలనీలో కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) నిర్వహణ లోపంతో పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఫలితంగా కాలనీ డ్రైనేజీ వ్యర్థాలు ఎలాంటి శుద్ధి లేకుండానే చెరువులోకి ప్రవహిస్తున్నాయి. ఎస్టీపీ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్లాంట్‌కు సంబంధించిన మోటార్లు, పంప్‌హౌస్ పరికరాలు, ఇతర విలువైన సామగ్రి జంగుపట్టి పూర్తిగా పాడైపోతున్నాయి. ప్రజాధనంతో నిర్మించిన మౌలిక వసతులు పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం కారణంగానే పరిస్థితి ఇంతవరకు వచ్చిందని ఆరోపిస్తు న్నారు. చెరువులోకి మురుగు నీరు చేరడంతో పరిసర ప్రాంతాల్లో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు దోమల బెడద తీవ్రమై అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సమీప నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు తక్షణమే స్పందించి, నిరుపయో గంగా మారిన ఎస్టీపీకి అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, పెద్ద చెరువులోకి మురుగు నీరు చేరకుండా శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ ఆర్ నగర్‌లో ఘనంగా మాగ్నెన్స్ డయాగ్నస్టిక్ ఐదవ వార్షికోత్సవ వేడుకలు



అమీర్‌పేట్, అక్టోబర్ 9(సింగిడి): మాగ్నెక్స్ డయాగ్నొస్టిక్ ఎండి సింగం శ్రీనివాసరావు మ్యాగ్నస్ డయాగ్నస్టిక్ ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ నామాన శేషు కుమారి సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ బాల్ రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు అనంతరం సింగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు కేక్ కట్ చేసి ఆయనకు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోను ప్రధానం చేశారు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఇలాంటి వార్షికోత్సవాలు ఇంకా మరెన్నో జరుపుకోవాలని ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నందుకు మీకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించాలి ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్సార్ నగర్ కౌన్సిల్ అధ్యక్షులు భరత్ ప్రసాద్ దుబే, మాణిక్ పాటిల్ ,కాసాని సహదేవ్ గౌడ్, కోటేశ్వరరావు, హరి సింగ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు

ఎడిటోరియల్

Editorial

ప్రపంచవ్యాప్త సమస్యగా మారిన మానసిక రుగ్మతలు

(10 అక్టోబర్ 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం జ్వరం లేకపోవడం మాత్రమే ఆరోగ్యం కాదని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, సామాజిక కుశలత ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం అవుతుందని వివరిస్తున్నారు. మానసిక ఆరోగ్యం అనగా మన శక్తి సామర్థ్యాలపై మనకు పూర్తి నమ్మకం ఉండడం, ఆ శక్తిని గరిష్టంగా వినియోగించడం, నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిం చడం, పౌర సంబంధాలను కొనసాగించం, సామాజిక బాధ్యతలను నిర్వహించడం లాంటి లక్ష్యాలు మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయి. మన ఆలోచనలు, భావనలు, ప్రవర్తనలు, సామాజిక సంబంధాల్లో ప్రతికూల ప్రభావాలను మానసిక రుగ్మతలుగా పేర్కొనాలి. మానసిక ఆరోగ్యంతో పిల్లల మానసిక రుగ్మతలు, మాదకద్రవ్యాల వినియోగం, ఆత్మహత్యలు, ఇతర వ్యాధులు సోకడం, పనిలో ఉత్పాదకత, ఆర్థిక అస్థిరత, కుటుంబ సభ్యుల వేదనలు ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయి. మానసిక అనారోగ్యం ఫలితంగా పిల్లల్లో విద్యలో వెనుకబాటు, మానవ సంబంధాల్లో తేడాలు కనిపిస్తాయి. మానసిక రుగ్మతలను తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేసుకోవచ్చు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం:

ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో ప్రతియేటా 10 అక్టోబర్ రోజున 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' పాటించడం ఆనవాయితీ వస్తున్నది. 1992లో ప్రారంభమైన ప్రపంచ మానసిక ఆరోగ్య దినం వేదుకల్లో భాగంగా విశ్వ మానవాళికి మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలపడం, మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించడం, మానసిక వికాసానికి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుంది. మానసిక దృఢత్వం కలిగిన వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానసిక వ్యాధికి మందు లేదనే నానుడి మనందరికి తెలుసు. జీవనోపాధికి బజారుకు వెళ్ళి కాయకష్టం చేసుకునే వారు కూడా నిత్యం విపత్తుల భయం గప్చిల్లో జీవిస్తూ, మానసిక ఆందోళనకు గురౌతున్నారు. శారీరక అనారోగ్యంగా ఉండే వారు మానసిక దృఢత్వంతో ఉన్నట్లయితే తొందరగా కోలుకున్నారు. ఔషధాలతో నయం కాని రోగాలు మానసిక ధైర్యంతో నయం అవుతాయి. వ్యాధి కన్న భయం ప్రమాదకరమైందని గమనించాలి. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం-2026' ఇతివృత్తంగా "మానసిక రుగ్మతల నుంచి బయట పడిన వారి అనుభవాలను వినడం : వాస్తవ గళాలు, వాస్తవ మార్పులు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తేనే ఆరోగ్య అసమానతలు తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మానసిక రోగుల్లో పేద, మధ్య ఆదాయ దేశాల ప్రజలు మాత్రమే 75-95 శాతం ఉన్నారని అంచనా. శారీరక ఆరోగ్యానికి మానసిక దృఢత్వం తప్పనిసరి అని అందరం గమనించాలి.

ప్రపంచ సమస్యగా మానసిక అనారోగ్యం:

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మానసిక ఆరోగ్య సాధనపై దృష్టి సారించి, పలు జాగ్రత్తలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి. భయం, ఒత్తిడి, ఉద్రేకం, నిరాశ, అధిక పని ఒత్తిడి, ఒంటరితనం, భావోద్వేగ ఆందోళనలు, నిద్రలేమి, మాదకద్రవ్యాలు, పర్యావరణం, కుటుంబ చరిత్ర, శారీరక ఆరోగ్యం, ఆహారం, ఆర్థిక అభద్రత, సామాజిక సంబంధాలు, పేదరికం, వివక్ష, అపోహలు, దురలవాట్లు, మెదడు గాయాలు, అప్పులు, లాంటివి మానసిక ఆరోగ్యానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 450 మిలియన్లకు పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 13 శాతం అనారోగ్యాలు మానసిక సంబంధమైనవిగా గుర్తించారు. ప్రపంచ పిల్లలు, కౌమార యువతలో 20 శాతం మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని తెలుస్తోంది.

మానసిక ఆరోగ్య రహస్యాలు:

మానసిక ఆరోగ్యం ఒక రోజులో సాధించేది కాదని, మన జీవనశైలి, ఆలోచనా విధానంతో దీర్ఘకాలిక జాగ్రత్తలు తీసుకోవడంతోనే సత్ఫలితాలు కనిపిస్తాయి.. మనసు విప్పి గలగల మాట్లాడడం, చలాకీగా ఉండడం, ప్రతి విషయాన్ని తేలికగా తీసుకోవడం, నవ్వటంతో పాటు నవ్వించడం, ఒత్తిడిని జయించడం, ప్రశాంతంగా నిద్ర పోవడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, సమయపాలన పాటించడం, శారీరక వ్యాయామానికి సమయం ఇవ్వడం, మిత్రులతో సమస్యలను చర్చించడం, ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కోవడం లాంటి అలవాట్లతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని నమ్మాలి. మానసిక ఆరోగ్య పరిరక్షణకు సకారాత్మక అవగాహన కల్పించడం, కుటుంబ సభ్యులు పలు అంశాల్లో మనసు విప్పి మాట్లాడుకోవడం తప్పనిసరి. సమస్యలు లేని జీవితం లేదు. వైఫల్యం రుచి చూడని వీరుడు లేడు. కష్టాలు మనకు మాత్రమే రాలేదు. కష్టసుఖాల సంగమమే జీవితం. విజయంతో విర్రవీగక, అపజయంలో ఆందోళన పడక, మానసిక పరిపక్వతతో అడుగులు వేసిన వారిని మానసిక ఆరోగ్యం వరిస్తుంది.

మానసిక ఆరోగ్యంతోనే పనిలో సఫలత సిద్ధిస్తుందని, అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, మానసిక ఆందోళన ప్రతికూల ఫలితాలను ఇస్తుంది. మానసిక ఆందోళనతో శారీరక సామర్థ్యం తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ తమ తమ విధులను నిర్వహిస్తూ మానసిక, సామాజిక, శారీరక ఆరోగ్యాన్ని పొంది దేశాభివృద్ధిలో పాలు పంచుకుందాం. శారీరక, మానసిక ఆరోగ్యమే మనిషి ప్రగతికి తొలి మెట్టు అవుతుందని గట్టిగా నమ్ముదాం. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని నినదిద్దాం.

కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఆకాశవాణి అగ్రగణ్య కళాకారుడు నేదునూరి

నేదునూరి కృష్ణమూర్తి జయంతి

నేదునూరి కృష్ణమూర్తి (1927, అక్టోబరు 10 – 2014, డిసెంబరు 8) కర్ణాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి బిరుదు పొందిన వాడు. మొదట్లో వయొలిన్ మీద ఆసక్తితో ఉన్నా తర్వాత గురువుల సలహాపై గాత్ర సంగీతం వైపు మొగ్గు చూపా డు. శ్రీపాద పినాక పాణి వంటి వారి వద్ద శిష్యరికం చేశాడు. అన్నమాచార్య సంకీర్త నలు, రామదాస



కీర్తనలను స్వర పరిచాడు. నాదసుధా తరంగిణి అనే ట్రస్టును ఏర్పాటు చేసి స్వరపరిచిన కీర్తనలను వాటి నొటేషన్లతో సహా ప్రచురిం చాడు.

కృష్ణమూర్తి అక్టోబరు 10, 1927 న తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో రామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంప తులకు జన్మించాడు. ఇంట్లో అందరికన్నా చిన్నవాడు. ఆయన తండ్రి పిఠాపురం రాజా వారి సంస్థాన కార్యాలయంలో పనిచేస్తూండే వారు. నేదునూరి 1940 లో విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో వయొలిన్, గాత్రంలో ప్రాథమిక శిక్షణ పొందాడు. కీర్తిశేషులు ద్వారం నరసింగరావు నాయుడు శిష్యుడిగా ఉన్నాడు. 1945 నుంచి సంగీత సభలలో పాల్గొంటూ వచ్చాడు. 1949లో ప్రముఖ సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి వద్ద చేసి సంగీతంలో గమకాలు, ఇతర మెళకువలలో శిక్షణ పొంది, సంగీత నైపుణ్యానికి మెరుగులు దిద్దాడు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా వెలుగులోకి వచ్చాడు. 1951 నుండి ఐదు దశాబ్దాలకు పైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చాడు.

బాల్యం నుండి ఆయనకు సంగీతంలో మంచి అభిరుచి ఉండేది. అష్టపదులు, తరంగా లు, రామాయణ కృతులు పాడారు. చిన్నతనంలో నేదునూరి గ్రామంలో పెరిగిన ఆయన, విద్వాన్ అప్పా రావు వద్ద వర్ణాలు; కల్లూరి వేణు గోపాల రావు వద్ద అష్ట పదులు, తరంగాలు నేర్చు కున్నారు. అప్పల నరసింహం సహాకారం తో విజయ నగరం మహారాజా కాలేజీలో చేరాడు.

ఆయన అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టాడు. "నానాటి బ్రతుకు నాటకము" కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రశంసిస్తూ ఎం. ఎస్. సుబ్బలక్ష్మి "నేదునూరి గారూ, ఆ ఒక్కపాటకు బాణీని కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వచ్చండి" అని మెచ్చుకున్న సంఘటన. 1991 లో సంగీత కళానిధి పురస్కారం ఇచ్చినప్పుడు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఆయన పేరును ప్రతిపాదించగా, సుబ్బలక్ష్మి ఆ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేశారు.

2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారానికి కూడా ఎంపికయ్యాడు.

సంగీత లోకంలో ప్రముఖ స్థానం సంపాయించు కున్నాడు. సంగీత అకాడమీలో యాభై యేళ్ళకు పైగా పాడాడు. తన సుదీర్ఘ సంగీత యాత్రలో అనేక సంగీత కోవిదు లయిన ద్వారం వెంకట స్వామి నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాక పాణి, లాల్గుడి జయరామన్, ఎం ఎస్ సుబ్బులక్ష్మి, పేరి శ్రీరామ మూర్తి (వయొలిన్), వెంకట రమణ (మృదంగం), నేమాని సోమ యాజులు (ఘటం) ఇత్యాదు లచే నేదునూరి కొనియాడ బడ్డాడు.

నేదునూరి విజయవాడ జీ వీ ఆర్ ప్రభుత్వ సంగీత, నాట్య కళాశాల, ప్రధాన అధ్యాప కుడిగా, సికింద్రా బాద్, విజయ నగరం, తిరుపతి సంగీత కళాశాలలో పని చేసాడు. వేంకటేశ్వర, నాగార్జున విశ్వ విద్యాలయాలలో ఆర్ట్స్ విభాగం డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆల్ ఇండియా రేడియో, సంగీత విభాగ ఆడిషన్ బోర్డ్ సభ్యుడిగా పనిచేసాడు. కొంతకాలం ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ ఆచార్యుడిగా ఉన్నాడు.
నేదునూరి కృష్ణమూర్తి స్వర పరచిన కీర్తనలలో – దాశరథి శతకం పద్యాలు, రాగ సుధా రసాలతో భద్రాచల రామదాస కీర్తనలు సీడీల రూపంలో తెచ్చారు. అన్నమాచార్య సంకీర్తనలు, పద కదంబం మీద పలు సీడీలు, కేసెట్లు వెలువరిం చారు. ఆల్ ఇండియా రేడియో భక్తి రంజనిలో కూర్చిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాస కీర్తనలు వాసికెక్కాయి.

టీ టీ డీ – ఆస్థాన విద్వాంసులుగా నియమితులైయ్యాడు. అన్నమాచార్య కృతులని కూర్చి సంగీత లోకానికి అందించాడు. మద్రాసు సంగీత అకాడమి నుండి సంగీత కళానిధి గౌరవం అందు కున్నాడు. శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం (2002), నేషనల్ ఎమినెన్స్ అవార్డు (2006), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి కళా నీరాజనం పురస్కారం (1995), 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నాడు.

నేదునూరి ప్రముఖ శిష్యులలో కళాప్రపూర్ణ చిట్టి అబ్బాయి, శ్రీమతి కోక సత్యవతి, శ్రీమతి కె. సరస్వతి వుద్యార్తి, జి. బాలకృష్ణ ప్రసాద్, శ్రీమతి శోభారాజు, మల్లాది సోదరులు (శివరామ ప్రసాద్, రవి కుమార్) ఉన్నారు.
నేదునూరి 2014 డిసెంబరు 8న, అనారోగ్యంతో బాధపడుతూ 87 సంవత్సరాల వయసులో దేహం చాలించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

అభినయ అగ్నిపర్వతం: నానా పటేకర్ నట ప్రస్థానం

భారతీయ చలనచిత్ర యవనికపై తనదైన అగ్నిపర్వత సదృశ అభినయంతో, నిక్కచ్చితనంతో చెరగని ముద్ర వేసిన మహోన్నత కళాతపస్వి నానా పటేకర్ అస్తమయం యావత్ సినీ ప్రపంచాన్ని, కోట్లాది మంది అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిత్యం సజీవ చైతన్యంతో ఉట్టిపడే ఆ గంభీర స్వరం, నిశ్శబ్దంతోనే వెండితెరను కంపింపజేసిన ఆ తీక్షణ నేత్రాలు శాశ్వతంగా మూతపడటం భారతీయ కళారంగానికి పూడ్చలేని తీరని లోటు. గోవాలోని డోనా పౌలా తీర ప్రాంతంలోని తన స్వగృహంలో గురువారం వేకువజామున తీవ్రమైన గుండెపోటుకు గురైన ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లగా, హుటాహుటిన సమీపంలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగానికి చెందిన నిపుణులైన వైద్య బృందం సుమారు 45 నిమిషాల పాటు నిరంతరాయంగా కార్డియోపల్మనరీ రిసుసిటేషన్ (సీపీఆర్) ప్రక్రియను నిర్వహించి, ఆయన ప్రాణాలను నిలబెట్టేందుకు సర్వశక్తులూ ఒడ్డి శ్రమించినప్పటికీ విధి వక్రీకరించింది. గురువారం ఉదయం 5.20 గంటల సమయంలో 75 ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు అధికారికంగా ప్రకటించడంతో ఒక అసమాన నటనా శకానికి తెరపడింది.



విశేషమేమిటంటే, ఈ విషాదకర సంఘటనకు కేవలం నాలుగు రోజుల ముందు, అక్టోబరు 4వ తేదీన డోనా పౌలాలో జరిగిన ఒక స్థానిక కార్యక్రమంలో నిండైన ఉత్సాహంతో పాల్గొని మాట్లాడిన ఆయన, ఇంతలోనే అనంత లోకాలకు పయనమవడం జీవితం ఎంతటి అనిశ్చితమైనదో విషాదభరితంగా చాటిచెప్పింది.

నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ గజానన్ పటేకర్. మహారాష్ట్రలోని మురుద్-జంజీరా తీరప్రాంతంలో 1951 జనవరి 1న ఒక సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన జీవన ప్రస్థానం పూలపాన్పు కాదు, అనేక ఆటుపోట్లతో కూడిన ముళ్లబాట. చిన్నతనంలోనే తండ్రి వ్యాపారంలో ఎదురైన తీవ్ర ఆర్థిక నష్టాలు ఆయన కుటుంబాన్ని నిరాశ్రయులను చేయగా, బతుకుదెరువు కోసం వీధి గోడలపై సినిమా పోస్టర్లు అతికించడం, నెలకు కేవలం ముప్పై రూపాయల స్వల్ప వేతనంతో జీవనం సాగించడం వంటి కఠిన వాస్తవాలు ఆయన వ్యక్తిత్వాన్ని కరిగించి పోతపోశాయి. ఆకలి కేకలు, పేదరికం మిగిల్చిన గాయాలే ఆయన భావి నటనా జీవితంలో అసహజత్వాన్ని తుడిచిపెట్టి, సహజమైన ఆవేశానికి, ఆర్ద్రతకు సజీవ పునాదులుగా మారాయి. ముంబైలోని సుప్రసిద్ధ సర్ జేజే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్‌లో వాణిజ్య కళను అభ్యసించిన అనంతరం, తన రక్తంలో ప్రవహిస్తున్న కళాతృష్ణను గుర్తించి రంగస్థలం వైపు అడుగులు వేశారు. మరాఠీ నాటకరంగంలో పదునైన సంభాషణలు, విలక్షణమైన శారీరక కదలికలతో తిరుగులేని నటుడిగా ఎదిగి, రంగస్థలం నేర్పిన అచంచల క్రమశిక్షణతో వెండితెరపైకి అడుగుపెట్టారు.

1978లో ముజఫర్ అలీ దర్శకత్వం వహించిన 'గమన్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, ఆయనలోని నటనా వైభవాన్ని దేశానికి చాటిచెప్పిన చిత్రం 1986 నాటి 'అంకుశ్'. ఎనభైల దశకంలో నిరుద్యోగంతో రగిలిపోతున్న యువత ఆక్రందనను, నిస్సహాయ క్రోధాన్ని తన కనుగుడ్లలో ప్రతిబింబించిన తీరుతో ఆయన పరిశ్రమ దృష్టిని బలంగా ఆకర్షించారు. అనంతరం 1989లో విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ క్లాసిక్ 'పరిందా'లో అన్నా సేఠ్ అనే మానసిక వికలత్వంతో కూడిన క్రూరమైన అండర్‌వరల్డ్ డాన్ పాత్రలో నానా ఒలికించిన నటన భారతీయ సినీ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచి, ఆయనకు ఉత్తమ సహాయ నటుడిగా తొలి జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. 1991లో స్వయంగా దర్శకత్వం వహించి, ప్రధాన పాత్ర పోషించిన 'ప్రహార్: ది ఫైనల్ అటాక్' చిత్రం ఆయన అంకితభావానికి నిదర్శనం. ఈ చిత్రం కోసం కఠినమైన సైనిక శిక్షణను స్వయంగా స్వీకరించి, దేశభక్తిని కేవలం ఆర్భాటాలకే పరిమితం చేయకుండా వాస్తవిక దృక్పథంతో తెరకెక్కించి ప్రశంసలు అందుకున్నారు.

1994లో వచ్చిన 'క్రాంతివీర్' చిత్రంలో ప్రతాప్ నారాయణ్ తిలక్ పాత్రలో ఆయన చేసిన ప్రసంగాలు, పలికిన సంభాషణలు సామాజిక చైతన్యాన్ని రగిలించాయి. మతం పేరిట మారణహోమం సృష్టించే ఛాందసత్వాన్ని సవాలు చేస్తూ, తన చేతి రక్తాన్ని మరొకరి రక్తంతో కలిపి 'ఏది హిందూ రక్తం, ఏది ముస్లిం రక్తం చెప్పు' అంటూ ఉరికంభం సాక్షిగా ఆయన పలికించిన పరుషమైన నిజాలు కోట్లాది ప్రేక్షకుల గుండెలను తాకాయి. ఈ అద్భుత నటనకు గాను ఆయన ఉత్తమ నటుడిగా రెండో జాతీయ పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. తదనంతరం 1996లో వచ్చిన 'అగ్ని సాక్షి'లో అనుమానపు భర్తగా సంక్లిష్టమైన మానసిక ఉద్వేగాలను ప్రదర్శించి మూడోసారి జాతీయ పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. 'తిరంగా'లో నిర్భయమైన పోలీస్ ఆఫీసర్‌గా రాజ్ కుమార్‌తో పోటీపడి నటించిన తీరు, సంజయ్ లీలా భన్సాలీ 'ఖామోషీ: ది మ్యూజికల్' చిత్రంలో మూగ-చెవుడు తండ్రిగా ఆయన కన్నీళ్లు పెట్టించిన సున్నితమైన భావోద్వేగాలు, రామ్‌గోపాల్ వర్మ 'అబ్ తక్ ఛప్పన్'లో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ సాధు అగాషేగా ప్రదర్శించిన సంయమనం, ప్రకాష్ ఝా 'రాజనీతి' మరియు 'అపహరణ్'లలో రాజకీయ చతురతను పండించిన తీరు ఆయన నటనలోని అనంత వైవిధ్యానికి నిదర్శనాలు. 2007లో వచ్చిన 'వెల్‌కమ్' చిత్రంలో ఉదయ్ శెట్టిగా ఆయన పండించిన హాస్యం ఆయనలోని బహుముఖ ప్రజ్ఞను మరోసారి చాటింది. మరాఠీ రంగంలో 'నటసమ్రాట్' చిత్రంలో శేషజీవితంలో అవమానాలు ఎదుర్కొనే రంగస్థల కళాకారుడు అప్పా బెల్వాల్కర్‌గా ఆయన జీవించిన తీరు ప్రపంచ స్థాయి నటనకు దీటైనది.

నానా పటేకర్ నటనా శైలి విలక్షణమైనది; ఆయన డైలాగులు చెప్పేటప్పుడు వాక్యాల మధ్య ఇచ్చే విరామం, హఠాత్తుగా పెరిగే స్వరస్థాయి, నిశ్శబ్దంగా ఉంటూనే చూపులతోనే భయాన్ని లేదా కరుణను వ్యక్తం చేసే పద్ధతి భావితరాలకు ఒక పాఠశాల. కళను వ్యాపారంగా మాత్రమే కాకుండా సమాజ సేవా మార్గంగా మలిచిన అరుదైన మానవతావాది ఆయన. మహారాష్ట్రలోని మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాలలో వర్షాభావం వల్ల, అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు మకరంద్ అనాస్‌పురేతో కలిసి 'నామ్ ఫౌండేషన్'ను స్థాపించారు. తన సంపాదనలోని గణనీయమైన భాగాన్ని ఈ ట్రస్టుకు ధారపోసి, వేలాది రైతు కుటుంబాలకు ఆర్థిక ఊరటనిచ్చారు, స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి చెరువుల పూడికతీత, గ్రామీణ నీటి సంరక్షణ పనులను పర్యవేక్షించారు. ప్రచార ఆర్భాటాలకు సుదూరంగా ఉంటూ, ముంబై నడిబొడ్డున ఉన్న విలాసవంతమైన జీవితాన్ని కాదని, పుణే సమీపంలోని ఖడక్‌వాస్లాలోని తన చిన్న వ్యవసాయ క్షేత్రంలో మట్టితో మమేకమై గడపడం ఆయన నిరాడంబర జీవన విధానానికి పరాకాష్ఠ.
కళారంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2013లో ఆయనను దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మశ్రీ'తో సత్కరించింది.

నానా పటేకర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన వెండితెరపై సృష్టించిన ప్రభంజనం, అన్నదాతల కన్నీళ్లు తుడిచిన ఆయన సేవా గుణం శాశ్వతంగా నిలిచి ఉంటాయి. మనుషులు తనువు చాలించవచ్చు గానీ, వెండితెరపై ఆయన జీవించిన అపురూప పాత్రలు, సంభాషణలు, నిక్కచ్చితనంతో కూడిన నిండైన వ్యక్తిత్వం తరతరాల కళాకారులకు, సమాజానికి నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి; భారతీయ సినిమా చరిత్ర పుటల్లో ఆయన పేరు ఒక ధ్రువతారలా చిరస్థాయిగా వెలుగుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494**

రాహుల్, ప్రియాంకల అరెస్టుపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం



- జమ్మికుంట బస్టాండ్ వద్ద మహా ధర్నా, రాస్తారోకో
- ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం ఆగదు
- సజ్జద్ మహమ్మద్

జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలపై జరిగిన దాడి, అరెస్టులను ఖండిస్తూ జమ్మికుంట బస్టాండ్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సజ్జద్ మహమ్మద్, జమ్మికుంట ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సజ్జద్ మహమ్మద్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు చేస్తున్న పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అప్రజాస్వామిక చర్యలకు బాధ్యత వహిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులపై దాడులు, అరెస్టులు కొనసాగితే యువజన కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ చందా రాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్, దౌలత్, ప్రధాన కార్యదర్శులు శనిగరపు తరుణ్, పంజాల అజయ్, పాతకాల రమేష్, ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పర్వేజ్, బాబర్, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షుడు బూడిగే శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్ దేవుని ఆకినపల్లి శ్యామ్ కళ్యాణ్ సేవాదళ్ మండల్ అధ్యక్షులు రామకృష్ణ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శిలు వల్లాల రవి టెంకురాల కిషోర్ పర్లపెల్లి అజయ్ రాజేష్ ఇమ్రాన్ రాచపల్లి రాజశేఖర్ శనిగరపు రాజు శివ కొలుగూరి రవి సమీర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు విద్యార్థినుల నీరాజనం

- పూల జాతరగా కృష్ణవేణి పాఠశాల..
- సంప్రదాయ దుస్తులు.. బతుకమ్మ పాటలు.. కోలాటాలతో పండుగ సందడి
- భావితరాలకు పండుగల విశిష్టతను పరిచయం చేయడమే లక్ష్యం
- డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి



గోదావరిఖని, అక్టోబర్ 09 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సోయగాన్ని చాటుతూ గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన విద్యార్థినులు, జానపద గీతాలాపనతో పాఠశాల ప్రాంగణం పండుగ కళను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ముందస్తుగా నిర్వహించారు.పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు ప్రిన్సిపల్స్ రాజిరెడ్డి, రామకృష్ణ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యార్థినులు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రకృతితో ముడిపడిన పండుగ బతుకమ్మ

ఈ సందర్భంగా డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో ముడిపడిన అనుబంధానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం మన సంస్కృతిలోని ప్రత్యేకతను చాటుతుందని పేర్కొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే అవగాహన

విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని డైరెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఇలాంటి పండుగలను నిర్వహించడం ద్వారా తెలంగాణ పండుగల ప్రాముఖ్యతను చిన్నారులు తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. మన పూర్వీకుల నుంచి అందిన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

బతుకమ్మపాటలు, సంప్రదాయ నృత్యాలు, విద్యార్థినుల సందడి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ పాటలు పాడిన విద్యార్థినులు పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఉపాధ్యాయినులు సైతం విద్యార్థినులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ రాజిరెడ్డి, రామకృష్ణ, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.







క్యాన్సర్ చికిత్సలో సరికొత్త సాంకేతికత.. మెరుగైన వైద్య సేవలు!

వ్యాధి తీవ్రతకు అనుగుణంగా ప్రత్యేక చికిత్స
ఆరోగ్యకరమైన కణజాలానికి హాని తగ్గించడమే లక్ష్యం
సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి నిపుణులు డాక్టర్ సుమంత్ కుమార్ వెల్లడి



పెద్దపల్లి, అక్టోబర్ 09 (సింగిడి): క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఆధునిక వైద్య రంగంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోందని, ఈ విధానాలు రోగులకు మరింత కచ్చితమైన, మెరుగైన చికిత్స అందించేందుకు దోహదపడుతున్నాయని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల నిపుణులు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుపట్ల తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ దశ, వ్యాధి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించడం కీలకమని పేర్కొన్నారు. పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ థెరపీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వ్యాధిని నియంత్రించడం, దాని తీవ్రతను తగ్గించడం, రోగి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఈ చికిత్స ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులోకి రావడంతో క్యాన్సర్ సోకిన ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించే అవకాశాలు పెరిగాయని డాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు. రేడియేషన్ చికిత్సలో ఉపయోగించే హైపర్‌సైట్ సాంకేతిక విధానం ద్వారా క్యాన్సర్ ప్రభావిత భాగంపై కచ్చితత్వంతో చికిత్స అందించేందుకు వీలుంటుందని వివరించారు. తద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలంపై ప్రభావాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

దుష్ప్రభావాలను తగ్గించడమే ప్రాధాన్యం

క్యాన్సర్ చికిత్స సమయంలో రోగులకు ఎదురయ్యే దుష్ప్రభావాలను సాధ్యమైనంత వరకు తగ్గిస్తూ, చికిత్సను మరింత ప్రభావవంతంగా అందించడంపై వైద్య రంగం దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోగికి ఒకే విధమైన చికిత్స సరిపోదని, వైద్య పరీక్షలు, వ్యాధి స్థితిని బట్టి తగిన చికిత్సా విధానాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ప్రతి నెల రెండు రోజులు వైద్య సేవలు

స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి నెల రెండో, నాలుగో బుధవారాల్లో పెద్దపల్లిలోని సూర్యప్రయోగశాలలో అందుబాటులో ఉంటానని డాక్టర్ సుమంత్ కుమార్ వెల్లడించారు. క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య సలహాలు, అవసరమైన పరీక్షలు, తదుపరి చికిత్సపై నిపుణుల సూచనలు పొందేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి వ్యాపార ప్రచార నిర్వాహకులు లక్ష్మణరావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కుల సాధనకు సమరశంఖం!

వృత్తి ఆధునీకరణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి
గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి: బెల్లంకొండ వెంకటేశ్వర్లు
37,381 మంది దరఖాస్తుదారులకు షరతుల్లేకుండా పింఛన్లు మంజూరు చేయాలి
కుక్కలగూడూరులో అక్రమ బెల్ట్‌షాపును తొలగించాలని కార్మికుల డిమాండ్





పెద్దపల్లి, అక్టోబర్ 09: (సింగిడి): కల్లుగీత కార్మికుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, ఆధునీకరణ లక్ష్యంగా ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ కల్లుగీతయ కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాలు, రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గౌడ కులస్తులు, గీత కార్మికులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో జరిగే ఈ సదస్సులో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తి ఆధునీకరణ, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 50 ఏళ్లు నిండిన 37,381 మంది గీత కార్మికులు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఎలాంటి షరతులు విధించకుండా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. గీత కార్మికుల పింఛన్‌ను నెలకు రూ. 4 వేలకు పెంచడంతోపాటు, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ. 10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

వృత్తిలో భద్రత.. ఆధునికతకు ప్రాధాన్యం

తాటి, ఈత చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికులందరికీ కంఠమయ్య రక్షణ కవచాలు అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించాలని, వృత్తిలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి గీత కార్మిక సహకార సంఘానికి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని సూచించారు. జిల్లా కేంద్రాల్లో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల తయారీ, విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి కార్మికులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గీత కార్మిక సహకార సంఘాలను పునరుద్ధరించి, కార్మికుల ఉపాధికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గీత కార్మిక సంఘానికి సంపూర్ణ మద్దతు

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.అనంతరం సంఘం 69వ వార్షికోత్సవాలు, రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ వెంకటేశ్వర్లును సింగం సత్తయ్య గౌడ్ ఆధ్వర్యంలో కుక్కలగూడూరు గ్రామ గీత కార్మికులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

కల్లు మండువాలో బెల్ట్‌షాపు.. ఉపాధికి గం

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామంలోని కల్లు మండువాలో అక్రమంగా ఏర్పాటు చేసిన మద్యం బెల్ట్‌షాపును తక్షణమే తొలగించాలని గ్రామ గీత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ బెల్ట్‌షాపు కారణంగా గ్రామానికి చెందిన సుమారు 150 గీత కార్మిక కుటుంబాల ఉపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లు మండువాలో మద్యం బెల్ట్‌షాపు ఏర్పాటు చేయడంతో తమ సంప్రదాయ వృత్తికి నష్టం వాటిల్లుతోందని, కుటుంబ పోషణ భారంగా మారుతోందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపును తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీని కోరారు. సమావేశంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య, అంతర్గాం మండల నాయకులు కోల రామ్మూర్తి గౌడ్, పొన్నం అంజయ్య గౌడ్, శ్రీపతి తిరుపతి, ముక్కెర పోశయ్య, సింగం బుచ్చన్న, నేరెళ్ల రామయ్య, బొమ్మగాని కొండయ్య, పల్లె శ్రీను, ప్రభాకర్, నేరెళ్ల రాజగౌడ్, పల్లె సత్తయ్య, మహేష్, బైరు లచ్చయ్య, ఆరేళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం..

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, అభివృద్ధిపై చర్చ
మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్, అక్టోబరు 9 (సింగిడి): కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల నిర్వహణ, మార్కెట్ కమిటీ అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించడం, వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పాలకవర్గ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ డైరెక్టర్లు పంజాల శ్రీనివాస్, బోనాల శ్రీనివాస్, ఎం. డి. ఖాజా ఖాన్, మీసాల శంకర్, తప్పట్ల రాజు, జేగ్గని కనుకయ్య, రావనవేని సంపత్, కాశవేని భూమయ్య, మాలోతు మాలతి, శివనాథుని వెంకటేశ్వర్లు, పల్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శులు సయ్యద్ హైమత్ అలీ, ఓదెలు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రంజిత్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు వేడుకలు..
ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థినులు



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. జమ్మికుంట ప్రజలకు, విద్యార్థులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ఓదేలు కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ కె. రాజేంద్రం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవీందర్, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం. శ్యామల, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ కె. గణేష్, అధ్యాపకులు డాక్టర్ కె. మాధవి, కె. ఉమాకిరణ్, సి. రాజ్‌కుమార్, వి. కిరణ్ కుమార్, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మమత, డాక్టర్ పి. సుష్మ, డాక్టర్ పి. రవిప్రకాష్, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ డి. తిరుపతి, డాక్టర్ పి. స్వప్న, ఎన్. ప్రశాంత్, పి. అరుణ్ రాజ్, ఎ. రమేష్, ఎం. సాయికుమార్, డాక్టర్ వి. వనిత కుమారి, జి. అనూష, ఎస్. దీనా తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన సభ్యులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ అభినందనలు



కరీంనగర్, అక్టోబర్9 (సింగిడి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికల ద్వారా ఎంపికైంది. సహకార శాఖ ఉప అధికారి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి అభినందనలు తెలిపి, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని సూచించారు.నూతన కార్యవర్గం వివరాలు: ప్రధాన సలహా కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, యువజన సమన్వయకర్తగా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు.జిల్లా కార్యవర్గ సభ్యులుగా కోలా అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, చిదుర సురేష్, పి. శ్రీహరి రెడ్డి, రాగి శ్రీనివాస్, సాయిని నరేందర్, హనుమాండ్ల రాజిరెడ్డి, కానపర్తి మనోహర్‌రావు, ఎలుగందల మునీందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంత్‌రావు పాల్గొన్నారు.

చాణక్య కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు..
సంప్రదాయాలకు పెద్దపీట



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి విద్యార్థులు, అధ్యాపకులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దబ్బేట విజయ-రవీందర్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ మహిళల ఆరాధ్య పండుగ అని, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలను విద్యార్థులకు పరిచయం చేయడంతోపాటు, చాణక్య డిగ్రీ కళాశాలలో ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దబ్బేట విజయ-రవీందర్, డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్ రెడ్డి, చిరంజీవి, శివ, కళాశాల ప్రిన్సిపాల్ పంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నిఖిల, శ్రావణి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా వేళ.. బడి పిల్లలకు కొత్త బట్టలు!

సొంత ఖర్చులతో పది మంది విద్యార్థులకు నూతన వస్త్రాల పంపిణీ



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): దసరా పండుగ వేళ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆనందాన్ని నింపేందుకు గండ్రపల్లి గ్రామ సర్పంచ్ తోట స్వప్న, లక్ష్మణ్ దంపతులు ముందుకొచ్చారు. తమ సొంత ఖర్చులతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పది మంది విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతోపాటు పండుగ ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో తమ వంతు సహాయంగా దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో ఎండుతున్న పంటలు.. రైతుల గగ్గోలు!

- నీళ్లున్నా పంటలకు అందని తడి..
- వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతుల డిమాండ్



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, బావుల్లో నీరు ఉన్నా పంటలకు పారించలేని దుస్థితి నెలకొందని ఇల్లంతకుంట మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన రైతు ఏనుగు గోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులకు తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 18 గంటల పాటు విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం కరెంటు కోతల కారణంగా సాగు చేయడం కష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే, వాటికి నీరు అందించేందుకు విద్యుత్ లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు వర్షాలు సరిగా కురవక వరి పంటలు దెబ్బతింటుండగా, మరోవైపు బావుల్లో ఉన్న నీటిని వినియోగించుకునేందుకు కూడా కరెంటు అందడం లేదన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే సరైన స్పందన లభించడం లేదని వాపోయారు. రైతు కంట కన్నీరు ఆ రాష్ట్ర అభివృద్ధికి మంచిది కాదని పేర్కొన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే స్పందించాలని గోపాల్‌రెడ్డి కోరారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కనీసం 18 గంటల పాటు, ముఖ్యంగా పగటిపూట నిరంతరాయంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, ప్రభుత్వం, విద్యుత్ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సిద్ధార్థ విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన విద్యార్థులు, మాతృమూర్తుల ప్రదర్శనలు
- సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి

కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థల్లో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థుల మాతృమూర్తులకు బతుకమ్మ తయారీ పోటీ నిర్వహించారు.గత వారం రోజులుగా సాధన చేసిన మాతృమూర్తులు, విద్యార్థులు ప్రదర్శించిన కోలాటాలు, డాండియా నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బతుకమ్మను పేర్చడం నుంచి నిమజ్జనం వరకు జరిగే సంప్రదాయ ప్రక్రియను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఉత్తమ బతుకమ్మను ఎంపిక చేసి, విజేతలకు చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ స్వప్న రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి మాతృమూర్తులు పాల్గొన్నారు.



శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

విద్యారణ్యపురిలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలు, శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 28వ డివిజన్‌లోని విద్యారణ్యపురి కాలనీలో రూ. 50 లక్షల నిధులతో చేపట్టనున్న మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్లు నున్నావత్ భాస్కర్, సాధినేని లావణ్య మునీందర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విద్యారణ్యపురి అభివృద్ధికి గతంలో సాధారణ నిధుల నుంచి సుమారు రూ.కోటి కేటాయించామని, ఇటీవల రూ. 25 లక్షలతో రోడ్లు, మురుగునీటి కాలువల పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని చెత్త నిల్వ కేంద్రం సమస్య పరిష్కారానికి మరో రూ. 80 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. చెత్త శుద్ధి ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, బతుకమ్మ వేడుకల కోసం రూ. 2.80 కోట్లు కేటాయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. సద్దుల బతుకమ్మకు మూడు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కరీంనగర్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యశోద ఆసుపత్రిలో అత్యాధునిక ఈఎన్‌టీ వైద్య సేవలు

స్వరపేటిక, వాయిస్, శ్వాసనాళ సమస్యలకు ప్రత్యేక చికిత్సలు

సోమాజిగూడలో నిపుణుల బృందం అందుబాటులో ఉంది

ఈఎన్‌టీ, శ్వాసనాళ శస్త్రచికిత్స, అలర్జీ, చెవి వ్యాధుల నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్సూర్



కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో స్వరపేటిక, వాయిస్, శ్వాసనాళ సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఈఎన్‌టీ నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్సూర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద ఆసుపత్రి శాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలతో పాటు పిల్లల్లో శ్వాసనాళ సమస్యలు, మింగడంలో ఇబ్బందులు, శ్వాసనాళాల సంకుచితం, గురక, నిద్రలో శ్వాస సంబంధిత సమస్యలకు ప్రత్యేక పరీక్షలు, వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక నిర్ధారణ పరికరాలు, వివిధ విభాగాల నిపుణుల సమన్వయంతో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బృందంలో స్వరపేటిక, పిల్లల ఈఎన్‌టీ, శ్వాసనాళ శస్త్రచికిత్స, అలర్జీ, చెవి వ్యాధుల నిపుణుడు డా. అశీష్ డోరా ఘన్సూర్, తల--మెడ క్యాన్సర్ శస్త్రచికిత్స, ముక్కు, సైనస్, కపాల అడుగు భాగం శస్త్రచికిత్స నిపుణురాలు డా. ఎన్. అపూర్వా రెడ్డి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. “సాధారణ ఈఎన్‌టీ సమస్యల నుంచి సంక్లిష్టమైన వాయిస్, శ్వాసనాళ సమస్యల వరకు సమగ్ర చికిత్స అందించడమే మా లక్ష్యం. వివిధ విభాగాల నిపుణుల సమన్వయంతో రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాం” అని డా. అశీష్ డోరా ఘన్సూర్ తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

పరిష్కారానికి చైర్ పర్సన్ ఆదేశాలు

ట్రాన్స్ఫార్మర్లపై ఓవర్ లోడ్... లూజ్ వైర్లతో అవస్థలు

విద్యుత్ అధికారుల తీరుపై సర్పంచుల అసంతృప్తి

విద్యుత్ ఫిర్యాదులపై స్పందించిన పరిష్కార వేదిక



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి): విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల మేరకు సమస్యలను పరిష్కరించడంతోపాటు అవసరమైన చర్యలు చేపడతామని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక వరంగల్ చైర్‌పర్సన్ మాధవరావు తెలిపారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లిలో గల రూరల్ సెక్షన్ కార్యాలయంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఆయన అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో వైర్లు వదులుగా వేలాడుతున్నాయని, దీంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. విద్యుత్ పనులకు సంబంధించి అధికారులు అంచనాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ కనెక్షన్లు, మీటర్లలో సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాధవరావు మాట్లాడుతూ.. మూడు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తెలిపిన సమస్యలపై సంబంధిత ఏఈలు సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఫిర్యాదులను పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మూడు మండలాల ఏఈలు, రూరల్ సెక్షన్ అధికారులు, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మండల విద్యాధికారి మంతెన హేమలత

ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు..



జమ్మికుంట, అక్టోబర్ 9 (సిసింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ జమ్మికుంట మండలం కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) విధానంలో భాగంగా వినూత్న పద్ధతుల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హేమలత మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు వాటిపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ విధానంలో భాగంగా ఆటపాటలు, వివిధ కార్యక్రమాల ద్వారా బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దబ్బెట రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేస్తూ బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు.

గులాబీ రంగుపై లేని అభ్యంతరం.. కాషాయ రంగుపై ఎందుకీ రాద్ధాంతం?

బీఆర్ఎస్ నేతల ద్వంద్వ వైఖరిపై కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ అగ్రహం



కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భవనాలు, పథకాలు, రహదారులకు గులాబీ రంగు అద్దినప్పుడు అభ్యంతరం చెప్పని ఆ పార్టీ నాయకులు, ఇప్పుడు కాషాయ రంగుపై విమర్శలు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కరీంనగర్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాలకు అనుగుణంగా రంగులను వినియోగించుకుంటే రాజకీయ రాద్ధాంతం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కిసాన్ నగర్‌లోని జమ్మి గద్దె వద్ద కాషాయ రంగును చూసి బీఆర్ఎస్ నాయకులు, ఆ పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అభ్యంతరం వ్యక్తం చేయడం వెనుక రాజకీయ భయమే ఉందని విమర్శించారు. రంగుల రాజకీయాలను పక్కనపెట్టి, సంకుచిత వైఖరిని విడనాడి ప్రజల మనసులను గెలుచుకునే ప్రయత్నం చేయాలని బీఆర్ఎస్ నాయకత్వానికి సోమిడి వేణు ప్రసాద్ హితవు పలికారు.

మానేరు విద్యాసంస్థల్లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సంస్కృతి వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పాల్గొని, సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. తెలంగాణ జానపద గీతాలు, బతుకమ్మ పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం





మానకొండూర్, అక్టోబర్9(సింగిడి): దేశంలో జరుగుతున్న ఓటు చోరీకి వ్యతిరేకంగా న్యూఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని, ఎంపీ ప్రియాంక గాంధీ ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మానకొండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున ఆందోళన చేపట్టాయి. మానకొండూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధ్యావ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలని, ఓటు చోరీని అరికట్టాలని శాంతియుత మార్గంలో పోరాడుతున్న అగ్రనేతలను అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,సర్పంచులు, సహకార సంఘ అధ్యక్షులు,డైరెక్టర్లు, సర్పంచులు,ఉపసర్పంచ్ లు, ఎస్సీ, బీసీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు, తదితరులు హాజరయ్యారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతు సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలి
- విద్యుత్ సరఫరాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య



కరీంనగర్, అక్టోబర్9(సింగిడి): తెలంగాణలో రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య విమర్శించారు. కరీంనగర్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోతే గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, రైతు బీమా, రైతుబంధు పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంబంధం లేని వ్యవసాయ భూములను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.
అర్హమైన భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని కోరారు. రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ సరఫరా వివరాలను ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా వెల్లడిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, రుణమాఫీ, యూరియా కొరత, రైతు సంక్షేమ పథకాలు, విద్యుత్ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి రైతులకు అండగా నిలవాలని కిసాన్ మోర్చా నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి, వివిధ జిల్లాల నాయకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

అనుబంధాల కలయిక, ఆత్మ గౌరవ ప్రతీక బతుకమ్మ



మిర్యాలగూడ, అక్టోబర్ 9 (సింగిడి): మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ సార్ మాట్లాడుతూ బతుకమ్మ మన సంస్కృతి. ఇదొక వారసత్వ పండుగ. చరిత్రకు సాక్ష్యమైన పూల జాతర. నేలను ముద్దాడి, గంగను స్పర్శించి, పుట్ట మన్నును పూజించే తెలంగాణ గట్టుపైన.. పూలను కొలిచే అరుదైన సంప్రదాయం .. బతుకమ్మ. ‘బతుకమ్మ సంబురం’లో ఆడబిడ్డ అనురాగం, ఆత్మీయ పలకరింపు కనిపిస్తయి. చీరె.. సారె పెట్టి ఒడిబియ్యం పోసి నట్లు తీరొక్క పూలతో అలంకరించగా.. సింగిడి రంగుల్లాంటి ప్రజలను ఒక్కటి చేస్తది బతుకమ్మ. వాడిపోయిన ప్రేమలు బతుకమ్మ వేడుకలో చిగురిస్తయి. బాసిపోయిన బంధాలెన్నో బలపడి నిలబడుతయి. కంచెలను దాటుకొని.. ఏర్లను ఎదుర్కొని ఉరిమే ఉత్సాహంతో ‘ఇచ్చుకుందాం పుచ్చుకుందాం’అని వాయినమియ్యగా.. చీకటి మాటున ఉన్న బతుకులెన్నో నేరుగా వెలుగు వాకిట్లోకి వచ్చి ‘బతుకమ్మా.. బతుకునీయమ్మా’ అని తపిస్తయి! బతుకమ్మ చుట్టూ అల్లుకున్న విద్యార్థులు జనపదుల సంస్కృతి ని ప్రతిబింబించాయి.అలాగే అందరూ కలిసి వలయాకారంలో సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తెడ్ల పద్మావతి అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి..



జమ్మికుంట, అక్టోబర్ 9 (సింగిడి) : జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ఆరేపల్లి గ్రామానికి చెందిన మొండయ్య(50) అనే వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తన ఇంటిలో విద్యుత్ మరమ్మత్తులు ఉండగా వాటిని సరి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర అస్వస్థతకు గురికాగా హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

భూపాలపల్లిలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత

148 కంపెనీలు 12 వేల ఉద్యోగాలే లక్ష్యం



భూపాలపల్లి, అక్టోబర్ 9(సింగిడి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్స్ లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్ మేళాలో మొత్తం 148 కంపెనీలు ప్రతినిధులు పాల్గొని సుమారు 12 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇంటర్వ్యూలు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి యువత జాబ్ మేళాకు తరలి రావడంతో జాబ్ మేళా ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రిజిస్ట్రేషన్ ప్రక్రియను, వివిధ స్టాల్స్ ను పరిశీలించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. సాఫ్ట్ వేర్, బ్యాంకింగ్, విమానయాన రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో ప్రదీప్ రెడ్డి, ప్లేస్మెంట్ టీం లీడర్ నితిన్ రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, డిసిసి అధ్యక్షుడు కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, జిల్లా అధికారులు,కంపెనీల ప్రతినిధులు,ఉద్యోగ యువత పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో అక్టోబర్ 11న
జపాన్ ఫెస్టివల్

హైదరాబాద్, అక్టోబర్ 9 (సింగిడి):
నా రా జపాన్ హబ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ సహకారంతో అక్టోబర్ 11న హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్–2026 నిర్వహించనున్నారు. ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.హైదరాబాద్‌లో తొలి సారిగా మియోషి సిటీ పప్పెట్ షో, ప్రత్యేక ఇకెబానా ప్రదర్శన, ఇండియా–జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్ అవార్డులు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. జపాన్‌లో విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అవకాశాలపై యువతకు ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నారు.బోన్సాయ్, సుమి–ఏ, అనిమే, రోబోటిక్స్, మార్షల్ ఆర్ట్స్, జపనీస్ టీ సెరిమనీ, కాస్ప్లే తదితర సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. మీడియా సమావేశంలో నా రా జపాన్ హబ్ వ్యవస్థాపకుడు బి. రామ భద్ర, కో–ఫౌండర్ బి. నాగనాథ్, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ ప్రతినిధులు హిరోషి ఫురుటా, సోయిచిరో ససాకి, టగుచి హిడెట్సుగు పాల్గొని ఫెస్టివల్ వివరాలు వెల్లడించారు.

నల్లగుట్టలో బస్తీ బాట.. విద్యుత్ అధికారుల పర్యటన



సికింద్రాబాద్ బ్యూరో, అక్టోబర్ 9 (సింగిడి):
బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈ టి. వెంకటగోపాల్ నల్లగుట్టలో పర్యటించి విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించారు. తుప్పుపట్టిన హెచ్‌టీ విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఎం.వి. రమణారావు, ఏఈలు కె. శివదుర్గ ప్రసాద్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి
రైతుల కరెంట్ సమస్య పరిష్కరించాలి
తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి:
కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 9 (సింగిడి)
సంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పట్టణాలు ,వివిధ మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,



పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలపై కలెక్టర్‌తో విస్తృతంగా చర్చించారు.

రైతుల కరెంట్ సమస్యపై ప్రత్యేకంగా ప్రస్తావన
నియోజకవర్గంలో రైతులు విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కనీసం 8 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందకపోవడంతో సాగు పనులకు ఆటంకం కలుగుతోందని తెలిపారు.

తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
నియోజకవర్గంలోని పలు గ్రామాలు, ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉన్న నేపథ్యంలో పరిశ్రమలకు నీటి సరఫరా కంటే ప్రజల తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

అంబేద్కర్ భవనాల మంజూరుకు విజ్ఞప్తి
నియోజకవర్గంలోని అవసరమైన ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. సామాజిక వర్గాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అత్యవసర గ్రామాలకు బోర్‌వెల్స్ మంజూరు
తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న అత్యవసర గ్రామాల్లో బోర్‌వెల్స్ మంజూరు చేయాలని గతభేటీలో ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అత్యవసర గ్రామాల్లో రూ.21.50 లక్షల వ్యయంతో బోర్‌వెల్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలకు కొంతమేర ఉపశమనం లభించనుంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు ,మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మధిరకు 24 గంటలు.. కోదాడ రైతులకు కోతలేనా?

పంటలు ఎండుతున్నా.. సర్కారు పట్టించుకోదా?.. ఎడమ కాలువకు నీరివ్వాలి.. ఎండుతున్న పంటలను కాపాడాలి

కోదాడ, అక్టోబర్ 9 (సింగిడి)
వ్యవసాయానికి పగటిపూట 12 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని, సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ టీడీపీ కోదాడ పట్టణ అధ్యక్షుడు కట్ట సతీష్ ఆధ్వర్యంలో గురువారం సబ్‌స్టేషన్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. టీడీపీ మాజీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఓరుగంటి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటలు పొట్టదశకు చేరుకుని చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం



మొండిడివైఖరి వీడి రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని విడుదల చేసి సాగర్ ఎడమ కాలువ కింద పంటలను కాపాడాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గమైన మధిరలో 24 గంటల విద్యుత్ అందిస్తూ కోదాడ రైతులకు మాత్రం కోతలు విధించడం పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాతూలూరి గురవయ్య, సంపేట బాలకృష్ణ, ఏటుకూరి సురేశ్, కోదాటి గురవయ్య, బండ్ల రమేష్, దేవబత్తిని ప్రవీణ్, శోభన్, యాదయ్య, శ్రీమన్నారాయణ, రేవంత్‌రెడ్డి, గౌని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఆశిష్, జంగిలి గోపి, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.





వారాహి సిల్క్స్ రెండో వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ బ్యూరో , అక్టోబర్ 9 (సింగిడి)
జూబ్లీ హిల్స్‌లోని వారాహి సిల్క్స్ రెండో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి డా. ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తనకి చేనేత వస్త్రాలు అంటే ఇష్టం అని చేనేతని అందరూ ప్రోత్సహించాలని, దసరా కి చాలా కలెక్షన్ వారాహి లో ఉంచారు అని ఆమె అన్నారు, కేవలం రెండేళ్లలోనే సంస్థ ఆరు స్టోర్లకు విస్తరించిందని సంస్థకి కి శుభాకాంక్షలు చెప్పారు . నాణ్యమైన సిల్క్, బ్రైడల్, ఫెస్టివ్ కలెక్షన్స్‌తో కస్టమర్ల ఆదరణ పొందుతున్నామని డైరెక్టర్లు యేచూరి మణిదీప్, డా. స్పందన తెలిపారు. వార్షికోత్సవం, వివాహ సీజన్ సందర్భంగా అక్టోబర్ 10 నుంచి 25 వరకు ₹25,000 విలువైన కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు.



పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు: ఈసారి జీఎస్టీ రేట్లలో లేని మార్పులు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో వ్యాపార వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పన్ను రేట్లలో ఎటువంటి మార్పులు చేయనప్పటికీ, అధికారుల అరెస్టు అధికారాలకు సంబంధించి కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. జీఎస్టీ రేట్లపై ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదని, వాటిని ఏడాదికి ఒకసారి మాత్రమే సమీక్షిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రధానంగా పరిపాలనాపరమైన అంశాలపైనే దృష్టి సారించినట్లు ఆమె వెల్లడించారు. అలాగే, వ్యాపారులపై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు ఉద్దేశించిన కనీసం పరిమితిని రూ. 1 కోటి నుంచి రూ. 5 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇది వ్యాపార వర్గాలకు పెద్ద ఊరటనిచ్చే పరిణామం. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌ల విషయంలోనూ కౌన్సిల్ సానుకూల నిర్ణయం తీసుకుంది. సప్లయర్‌కు పూర్తి మొత్తం చెల్లించి, సక్రమమైన ఇన్వాయిసులు కలిగి ఉన్న కొనుగోలుదారుల ప్రయోజనాలను రక్షించే మార్గాలను అన్వేషించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు నెలల్లోగా తన నివేదికను సమర్పించనుంది. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వ్యాపారం సాగించే చిన్న వ్యాపారుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేశారు. అలాగే, వారిపై సాధారణ జరిమానాను రూ. 25,000 నుంచి రూ. 10,000కి తగ్గించారు. ఈ నిర్ణయాలు చిన్న వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుస్తాయని భావిస్తున్నారు.

1,045 పాయింట్లు కుప్పకూలిన సెన్సెక్స్

స్టాక్ మార్కెట్లో అమ్మకాల సునామీ..
స్టాక్ మార్కెట్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి
బ్యారెల్‌కు 104 డాలర్లు దాటిన బ్రెంట్ క్రూడాయిల్ ధర
371 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
2026లోనే అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయిన నిఫ్టీ
వడ్డీ రేట్ల పెంపు భయాలు, విదేశీ నిధుల తరలింపుతో నష్టాలు



భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భగ్గుమనడం, వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలోనే కొనసాగుతాయనే ఆందోళనలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1045.46 పాయింట్లు (1.44%) పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్లు (1.64%) నష్టపోయి 22,231.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఏకంగా 4% పెరిగి బ్యారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటడం మార్కెట్లలో భయాందోళనలకు ప్రధాన కారణమైంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచుతుందనే ఆందోళనలు రేకెత్తించింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 22,179.90 వరకు పడిపోయి, 2026 సంవత్సరంలోనే అత్యంత కనిష్ట స్థాయిని నమోదు చేసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయిందని, ఇప్పుడు 22,000 పాయింట్ల మానసిక మద్దతు స్థాయిపై దృష్టి కేంద్రీకృతమైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ సూచీ కోలుకోవడానికి ప్రయత్నిస్తే 22,400, ఆ తర్వాత 22,600 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ కనిపించింది. మెటల్ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోగా, ఐటీ రంగం మాత్రం కొంతమేర తట్టుకుని నిలబడింది. సెన్సెక్స్-30 షేర్లలో టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ మాత్రమే లాభపడగా.. ఐటీసీ, ఇండిగో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, మారుతీ సుజుకీ వంటి దిగ్గజాలు కూడా నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.53%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.34% చొప్పున పడిపోయాయి. రానున్న రోజుల్లో మార్కెట్ దృష్టి క్యూ2 (రెండో త్రైమాసికం) ఫలితాలపైకి మళ్లనుంది. డిమాండ్ స్థిరత్వం, ముడిసరుకుల వ్యయాల నిర్వహణపై కంపెనీల యాజమాన్యాలు చేసే వ్యాఖ్యలు సమీప భవిష్యత్తులో మార్కెట్ గమనాన్ని నిర్దేశించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీలు

పండుగల తర్వాత అమలు చేయాలంటున్న ట్రేడర్లు.. అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త ఛార్జీలు
రూ.2,000 దాటిన వ్యాపార లావాదేవీలపై కొత్త ఛార్జీల వర్తింపు
ఈ మార్పులు కేవలం 4శాతం వ్యాపార లావాదేవీలకే వర్తిస్తాయని ఎన్‌పీసీఐ స్పష్టీకరణ
ఛార్జీలను కస్టమర్ల నుంచి వసూలు చేయవద్దని వ్యాపారులకు బ్యాంకులు సూచన

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే వ్యాపార లావాదేవీలపై కొత్తగా ప్రతిపాదించిన 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఛార్జీల అమలును వాయిదా వేయాలని దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపార సంఘాలు 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ)ని కోరాయి. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో పండుగ సీజన్ ముగిసే వరకు లేదా వచ్చే ఏడాది ప్రారంభం వరకు దీనిని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు 'ఎన్డీటీవీ ప్రాఫిట్' తన కథనంలో పేర్కొంది. పండుగల సమయంలో అమ్మకాలు గరిష్ఠ స్థాయిలో ఉంటాయని, ఈ కీలక తరుణంలో కొత్త ఛార్జీలు అమలు చేస్తే వ్యాపారులపై ప్రతికూల ప్రభావం పడుతుందని ట్రేడ్ అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాటాదారులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఎన్‌పీసీఐ ఈ కొత్త ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది.



అయితే, వ్యాపారుల తాజా విజ్ఞప్తిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎన్‌పీసీఐ ప్రకటించిన కొత్త నిబంధనల ప్రకారం.. ఎంపిక చేసిన వ్యాపార కేటగిరీలలో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఫ్లాట్‌గా రూ.5 రుసుము విధిస్తారు. అదే సమయంలో, పెద్ద వ్యాపారులకు రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం ఫీజు ఉంటుంది. దీనిపై గరిష్ఠ పరిమితిని రూ.300గా నిర్ణయించారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీల వంటి క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. దీనికి కూడా గరిష్ఠ పరిమితి రూ.300గా ఉంటుంది. అయితే, ఈ మార్పుల వల్ల కేవలం 4 శాతం వ్యాపార లావాదేవీలపై మాత్రమే ప్రభావం పడుతుందని, 95 శాతానికి పైగా పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ చెల్లింపులకు ఈ ఛార్జీలు వర్తించవని ఎన్‌పీసీఐ అంచనా వేసింది. పీర్-టు-పీర్ (పీ2పీ) మోడల్‌ను ఉపయోగించే చిన్న వ్యాపారులకు ఎలాంటి ఎండీఆర్ ఛార్జీలు ఉండవని స్పష్టం చేసింది. సాధారణ వ్యక్తిగత వినియోగదారులపై ఎలాంటి ఛార్జీల భారం ఉండదు. వారు యథావిధిగా ఉచితంగా యూపీఐ చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ ఎండీఆర్ ద్వారా వసూలైన ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థ విస్తరణ, సైబర్ సెక్యూరిటీ మెరుగుదల, ఆవిష్కరణల కోసం వినియోగించనున్నారు. మొత్తం ఎండీఆర్ వసూళ్లలో 5 శాతాన్ని చిన్న వ్యాపారులలో యూపీఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసే ప్రత్యేక నిధికి కేటాయించనున్నారు. ముఖ్యంగా, ఈ ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు కస్టమర్లపై మోపకుండా చూడాలని బ్యాంకులకు ఎన్‌పీసీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

క్యాన్సర్ మందుల ధరలకు కేంద్రం కళ్లెం..

70 శాతం వరకు తగ్గే ఛాన్స్

క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని అన్ని క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసింది. ఈ నిర్ణయంతో కొన్ని మందుల గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ నిర్ణయం బ్రాండెడ్, జనరిక్ మందులతో పాటు దేశీయ, దిగుమతి మందులకూ వర్తిస్తుంది. పేటెంట్ ఉన్నవి, లేనివి కూడా ఇందులోకి వస్తాయి. మందుల సరఫరా వ్యవస్థలో అధిక లాభాలను నియంత్రించడంతో పాటు క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది. సుప్రీంకోర్టు ప్రశ్నల నేపథ్యంలో క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 29న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం కీలక ప్రశ్నలు వేసింది. ఓ క్యాన్సర్ మందును రిటైలర్లకు సుమారు రూ.2,700కు సరఫరా చేస్తుండగా.. దాని ఎంఆర్‌పీ రూ.27,000గా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. మందులపై ఒకే విధమైన మార్జిన్‌ను నిర్ణయించలేమా అని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పథకాల కింద చికిత్స పొందుతున్న వారికి ఆసుపత్రుల్లోని సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలని చెప్పడం పైనా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అక్టోబర్ 12న మరోసారి విచారణ జరగనుంది.



2019లోనూ ఇదే విధానం
ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ఇదే తొలిసారి కాదు. 2019లో 42 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందులపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) 30 శాతం మార్జిన్‌ను అమలు చేసింది. దీంతో 526 బ్రాండ్ల ఎంఆర్‌పీలు సగటున 50 శాతం తగ్గాయని కేంద్రం తెలిపింది. అప్పట్లో రోగులకు ఏటా సుమారు రూ.984 కోట్ల మేర ఆదా అయినట్లు అంచనా. తాజా నిర్ణయంతో కొన్ని మందుల ధరలు 70 శాతం వరకు తగ్గొచ్చని కేంద్రం చెబుతోంది. 2026 మార్చి నాటికి 131 క్యాన్సర్ మందులకు ఎన్‌పీపీఏ ధర పరిమితులు అమల్లో ఉన్నాయి. జన ఔషధి వంటి పథకాలు, కస్టమ్స్ సుంకాల తగ్గింపుతోనూ క్యాన్సర్ చికిత్స ఖర్చును తగ్గించే చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 10-10-2026

రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ శాంతియుత ధర్నా

ఓటు హక్కు వజ్రాయుధం.. దాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత: చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

ములుగు ప్రతినిధి, (సింగిడి): రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును ఖండిస్తూ మంగపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం శాంతియుత నిరసన ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకు లు కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘాన్ని కలిసి 'సర్' కార్యక్రమంపై నివేదిక అందించేందుకు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు శాంతియుతంగా బయలుదేరిన సమయంలో పోలీసులు లాఠీచార్జి చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. అంబేద్కర్ ప్రతి పౌరుడికి ఓటు హక్కుకల్పించేందుకు కృషి చేశారని, ప్రస్తుతం ఓట్ల తొలగింపు అంశం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారుతోందని ఆరోపించారు. ఓటు హక్కుప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిదని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, 'సర్' కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థాయి నుంచి



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి తగిన సమాధానం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమరం బాలన్న, జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాయం అనిత, జిల్లా యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, మహిళా మండల అధ్యక్షురాలు శానం నిర్మల, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, జిల్లా సీనియర్ నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, కారుపోతుల నరసయ్య, మండల నాయకులు కాటబోయిన నరసింహారావు, చిన్నపెల్లి రాంబాబు, తాతినేని హరికృష్ణ, గూడూరు రంజిత్, చింత చంద్రావతి, శానం సత్యనారాయణ, జంగం భానుచందర్, దుర్గం శివప్రసాద్, బిల్లాటి నరేష్, అన్నాల నరసింహారావు తదితరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన MROకు MRPS నాయకుల స్వాగతం



బుగ్గారం, (సింగిడి): బుగ్గారం మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన MROను MRPS నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన MROకు శుభాకాంక్షలు తెలిపి, మం డల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో MRPS ధర్మపురి నియోజ కవర్గ ఇన్‌చార్జ్ చిర్ర లక్ష్మణ్ మాదిగ, బుగ్గారం మండల అధ్యక్షులు నక్క రాజేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి చీపెల్లి భూమేష్ మాదిగ, అధికార ప్రతినిధి ఒరగంటి రమేష్ మాదిగ, బుగ్గారం గ్రామ శాఖ ఉపాధ్యక్షులు నక్కగణేష్ మాదిగ, అధికార ప్రతినిధి గోడిశెల పోచారాజు మాదిగ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

సీఐ వెంకటేశ్వర్లు



మహాదేవపూర్ (సింగిడి): బతుకమ్మ పండు గను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా ప్రశాంతమైన వాతావ రణంలో నిర్వహించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సిఐ వెంకటే శ్వర్లు అన్నారు. బతుకమ్మ కార్యక్రమాల నిర్వాహకులు పాటించాల్సిన సూచనలను తెలియజేశారు. బతుకమ్మ కార్యక్రమానికి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించి అవసరమైన అనుమతులు సూచనలు తీసుకోవాలని, ప్రదాన రహదారులు, కూడళ్లలో రాకపోకలకు అంతరాయం కలిగించకూడదని, కార్యక్రమం ప్రదేశంలో మద్యం సేవించి అల్లర్లు చేయడం, గొడవలు పడడం, అసభ్యకర ప్రవర్తన కు పాల్పడడం లాంటివి అనుమతించారాదని తెలిపారు. డీజేలు సౌండ్ సిస్టం విషయం లో పోలీసుల సూచనలు శబ్ద కాలుష్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారము అందించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే 112 కు సమాచారం అందించాలని వివరించారు. ప్రతి ఒక్కరు బతుకమ్మ పండుగను ఆనందంగా సురక్షితంగా ప్రశాంతంగా జరుపుకోవడానికి నిర్వాహకులు, యువత ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాహనాల వేలంతో ఎక్సైజ్ శాఖకు భారీ ఆదాయం

అప్‌సెట్ ధర కంటే రూ.1.77 లక్షలు అదనంగా సమకూరిన ఆదాయం



కాటారం, (సింగిడి): కాటారం ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 40 వాహనాల బహిరంగ వేలం గురువారం విజయవంతంగా నిర్వహిం చారు. జిల్లా ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కిరణ్ నాయక్ ఆధ్వర్యంలో వేలం ప్రక్రియ కొనసాగింది. మొత్తం 39 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం ద్వారా విక్ర యించారు. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైస్ రూ. 3,34,400 కాగా, బహిరంగ వేలంలో జీఎస్టీతో కలిపి రూ. 5,11,530 ఆదాయం వచ్చింది. దీంతో నిర్దేశిత కనీస ధర కంటే రూ. 1,77,130 అధికంగా ఆదాయం సమ కూరినట్లు అధికారులు తెలిపారు. వాహనాల వేలంలో ఆస క్తిగల కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీపడి ధరలు నిర్ణయించడంతో వాహనాలు కనీస ధర కంటే అధిక మొత్తాలకు విక్రయమయ్యాయి. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ వేలం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాటారం ఎక్సైజ్ సీఐ కరుణ శ్రీ, ఎస్సై సందీప్ కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొమిరెడ్డి లింగారెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : గజెంగి నందయ్య

మెట్‌పల్లి (సింగిడి): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కొమిరెడ్డి లింగారెడ్డిని నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజెంగి నందయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్





సూచనల మేరకు లింగారెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధివిధానాలకు అనుగుణంగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారుతనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కొమిరెడ్డి లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సొమ్ము దేవాలయాలది.. ప్రచారం రాష్ట్ర ప్రభుత్వానిదా?

అభివృద్ధి పేరుతో దేవాలయాల ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపణ

బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

హుస్నాబాద్ (సింగిడి): హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొత్తకొండ, పొట్లపల్లి, హుస్నాబాద్ దేవాల యాల్లో భక్తులు, దాతలు సమర్పిం చిన విరాళాల సొమ్మును ప్రభుత్వ నిధులుగా ప్రచారం చేసుకోవడం సరికాదని ఆరోపించారు. కేవలం పరిపాలనా అనుమతులు మంజూ రు చేసి, దేవాలయాల వద్ద ఉన్న నిధులను అభివృద్ధి పనులకు వినియోగించేం దుకు అనుమతి స్తూ, వాటిని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులుగా ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి



రూ. 3.80 కోట్లు, సిద్దిపేట జిల్లా పొట్లపల్లి శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి రూ. 1.50 కోట్లు, హుస్నాబాద్‌లోని రేణుక ఎల్లమ్మ దేవస్థాన అభివృద్ధికి రూ. 85 లక్షలు మంజూ రైనట్లు జరుగుతు న్న ప్రచారంపై ఆయన అభ్యం తరం వ్యక్తం చేశా రు. ఎండోమెంట్ శాఖ పరిధిలోని ఆయా దేవాలయాల బ్యాంకు ఖాతాల్లో ఉన్న స్థిర డిపాజిట్ రసీదులలోని నిధులు దేవాలయా లకు చెందిన భక్తులు, దాతల సొ మ్మేనని, అందులో రాష్ట్ర ప్రభు త్వానికి సంబంధించిన నిధులు లేవని రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్కరూపాయి కూడా ఈ దేవాలయాల అభివృద్ధికి కేటాయిం చలేదని ఆయన ఆరోపించారు. దేవాలయాల సొ మ్మును వినియోగించేందుకు పరి పాలనా అనుమతులు ఇచ్చి, ప్రభు త్వ నిధులు మంజూరు చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం సరికాదని అన్నారు. భక్తులు, దాతల విరాళా లను వినియోగించుకునే అంశాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారాల ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల భావన కల్పించే ప్రయత్నం జరుగుతోం దని ఆరోపించిన ఆయన, ఈ విధానాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అలరించిన బతుకమ్మ వేడుకలు..

ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినిల బృందం గురువారం రోజు నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అలరించాయి. మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ. పెద్దన్న ఆధ్వర్యంలో, కళాశాల ఎన్. ఎస్. ఎస్. విద్యార్థినిల ఎంపర్ మెంట్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన బి. ఏ. బి. ఎస్. సి. బి కం. బి ఎఫ్ ఎస్ ఐ, విద్యార్థులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి, మోర్తాడ్ డిగ్రీ కళాశాల నుండి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో, నిర్మల, నిర్మల, చిత్తు, చిత్తు బొమ్మల గుమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, తెలంగాణ కోలాటాలాడుతూ గ్రామంలోని మోర్తాడ్ ముసలమ్మ చెరువు వరకు శోభయాత్రగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం గావించి వారి వెంట తెచ్చుకున్నఫలహారాలను భుజించారు. ఈసందర్భంగా కళాశాల టీ. పెద్దన్న మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పూల పండుగ ప్రపంచవ్యాప్తంగా సంతరించుకుందని, ప్రపంచంలోనే బతుకమ్మ పూల పండుగ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన కొనియాడారు. బతుకమ్మల నిమజ్జనం అనంతరం సత్తుపల్లి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ బతుకమ్మ వేడుకలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మర్రి పల్లి భూపతి, ఐ. క్యు.ఏ.సి. డాక్టర్ యు, దశరథ్, ఉమెన్ ఎంపెర్మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ బి. బ్యుల, మహిళా అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ మండలం పెద్దమ ల్లారెడ్డి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సమతుల ఆహారం, పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిం చారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందేలా రోజువారీ ఆహారంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూర లు, పప్పుధాన్యాలు, పండ్లు, ఇతర పోషక విలువలున్న ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రా లు చిన్నారుల పోషణ, ఆరోగ్యం, ప్రాథమిక విద్యలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే చిన్నవయస్సు నుంచే మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కోడూరి సాయి గౌడ్, వార్డు సభ్యుడు ఈర సాహితీ స్వామి, అంగన్వాడీ టీచర్లు శ్యామల, సబిత, జయ, జ్యోతి, రాజమణి పాల్గొన్నారు.

చెరువుగట్టుకు శాశ్వత వెలుగులు



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ మండలం పెద్దమ ల్లారెడ్డి గ్రామంలోని చెరువుగట్టుకు శాశ్వత విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బతుకమ్మ పండుగను పురస్కరిం చుకుని చేపట్టిన విద్యుత్ పనుల్లో భాగంగా స్తంభాలు ఏర్పాటు చేసి, వైర్లు లాగే పనులను ఇప్పటికే పూర్తి చేశారు. గురువారం గ్రామం నుంచి చెరువుగట్టు వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఇకపై బతుకమ్మ పండుగతో పాటు చెరువుగట్టు వద్ద శాశ్వతంగా విద్యుత్ సదుపాయం అందు బాటులో ఉండనుంది. శాశ్వత విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ప్రారంభం సందర్భంగా గ్రామ సర్పంచ్ కోడూరి సాయిగౌడ్, ఉప సర్పంచ్ చైతన్య కొండల్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కొండాపూర్‌లో ఎంపీడీవో పర్యటన.. సమస్యలపై ఆరా.



నల్లబెల్లి, (సింగిడి): నల్లబెల్లి మండలం కొండా పూర్ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు, మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని నల్లబెల్లి ఎంపీడీవో తెలిపారు. గ్రామ పర్యటనలో భాగంగా పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను,పరిశీలించారు. విద్యార్థులకు అందు తున్నసౌకర్యాలు, పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం,కల్పించేందుకు అవసరమైన వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అధికా రులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల నిసూచించారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం

గ్రామానికి వచ్చిన ఎంపీడీవోకు సర్పంచ్ అబ్బరబోయిన లలిత సురేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సంబం ధించిన అంశాలను సర్పంచ్, ఉపాధ్యాయులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో ఇరిగేషన్ ఏఈ అధికారులు, పాఠశాల ఉపాధ్యా యులు, పంచాయతీ కార్యదర్శి, కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంపై గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా గోరుమంతుల ప్రవీణ్‌కుమార్

మెట్‌పల్లి (సింగిడి): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వేంపేట్ గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పాల్గొంటూ ప్రజా సమస్యలపై పోరాడినందుకు ప్రవీణ్‌కుమార్‌కు ఈ బాధ్యత అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం జరిగిన ఉద్యమంలో ప్రవీణ్‌కుమార్ సుదీర్ఘంగా పాల్గొన్నారని కాంగ్రెస్



నాయకులు పేర్కొన్నారు. ఉద్యమంలో భాగంగా పలుమార్లు అరెస్టయి జైలు జీవితం కూడా గడిపారని తెలిపారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న ఆయనకు జిల్లా స్థాయిలో బాధ్యత లభించడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

ఇండియా కూటమి నేతల అరెస్టులు అప్రజాస్వామికం

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్.



నల్లబెల్లి, (సింగిడి): ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రశ్నిస్తూ నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీఎస్ డైరెక్టర్ వైనాల అశోక్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం, అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన సందర్భంగా రాహుల్, ప్రియాంక గాంధీలతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఓట్ల తొలగింపు, ఓట్ల చోరీ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జరుగుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న అవకతవకలపై ప్రశ్నిస్తున్న నాయకులను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అశోక్ ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై లేవనెత్తుతున్న సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ఎవరూ అణచివేయలేరని ఆయన అన్నారు. ఓటు హక్కును, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాలో మార్పులపై ప్రతిపక్షాల నిరసనలుకొనసాగుతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైనాల అశోక్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని కోరారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 10-10-2026

భూ రక్షణ సమితి మండల అధ్యక్షుడిగాకడారి ఆదాం

పేదల భూముల హక్కుల కోసం పోరాడుతా: కడారి ఆదాం



భీమదేవరపల్లి, (సింగిడి):భూ సమస్యల పరిష్కారం, పేదల భూములకు హక్కుల సాధన లక్ష్యంగా భూ రక్షణ సమితి భీమదేవరపల్లి మండల అధ్యక్షుడిగా ముత్తారం గ్రామానికి చెందిన కడారి ఆదాం నియమితులయ్యారు. గురువారం హుస్నాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన నియామకాన్ని ప్రకటించారు.భూ రక్షణ సమితి సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి వేముగంటి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుగ్గ మైసన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక సిద్దులు, రాష్ట్ర కార్యదర్శులు నల్ల నర్సింగరావు, నత్తి కొర్నెల్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చౌదగారి సంజీవ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాముల రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడారి ఆదాం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అసైన్మెంట్ కింద కేటాయించిన భూములను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పేదల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పేదలకు భూములపై సర్వ హక్కులు కల్పించే దిశగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా హుస్సేన్‌నగర్, రత్నాపూర్



మల్లాపూర్, (సింగిడి):టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్, రత్నాపూర్ గ్రామాలను క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా గుర్తించారు. గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హుస్సేన్‌నగర్ గ్రామపంచాయతీకి గోల్డ్, రత్నాపూర్ గ్రామపంచాయతీకి బ్రాంజ్ కేటగిరీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు మల్లాపూర్ వైద్యాధికారి డాక్టర్ వాహినికి అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ ప్రశంస పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపల్లిలో పెరుగుతున్న జ్వరాలు



చింతలమానేపల్లి (సింగిడి): మండలంలోని ఆడపల్లి గ్రామంలో జ్వరాల కేసులు రోజురోజుకూ పెరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న కొంతమందిలో తెల్ల రక్తకణాలు (డబ్ల్యూబీసీ) తగ్గుతున్నట్లు సమాచారం రావడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితిపై లోనవెల్లి వైద్యాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల లక్షణాలపై పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు అందించి, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.జ్వరాలతో తీవ్రంగా బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు సర్పంచ్ సుగుణ భీమ్‌రావు, ఉపసర్పంచ్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాగజనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు, మరింత విస్తృతంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు వైద్య, పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

సూర్యుడి వెలుగుతో స్వయం సమృద్ధి దిశగా.. రామేశ్వర్ పల్లి

మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు అడుగులు..

ఉస్మానియా యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఔట్‌రీచ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన..

అంకోల్ క్యాంప్‌ను వంద శాతం సౌర గ్రామంగా మార్చిన బి. రాముకు అభినందనలు



బిక్కనూర్,(సింగిడి): పెరుగుతున్న విద్యుత్ అవస రాల నేపథ్యంలో సౌర విద్యుత్తు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రామేశ్వర్ పల్లిలో గురువారం సదస్సు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఆధ్వర్యంలో అవుట్‌రీచ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

అంకోల్ క్యాంప్ ఆదర్శంగా..

అంకోల్ క్యాంప్ గ్రామం సౌర విద్యుత్తు వినియోగంలో ముందంజలో ఉంది. సుమారు ఐదేళ్ల క్రితమే గ్రామాన్ని వంద శాతం సౌర విద్యుత్తు వినియోగించే గ్రామంగా తీర్చిదిద్దారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బి. రాము గ్రామంలో చేపట్టిన చర్యలను వివరించారు. ఆయన కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

ఇంటికే కాదు.. వ్యవసాయానికీ ఉపయోగం

ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. వీధి దీపాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, చిన్న వ్యాపారాల్లోనూ సౌర విద్యుత్తును వినియోగించవచ్చు. వ్యవసాయంలో సౌర విద్యుత్తు ఆధారిత నీటి పంపులు, ఇతర పరికరాల వినియోగం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

సబ్సిడీలను వినియోగించుకోవాలి

సౌర విద్యుత్తు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా రాయితీలు, రుణ సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇళ్లపై సౌర ఫలకాల ఏర్పాటుతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిపై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడంతో ప్రయోజనం పొందలేకపో తున్నారని, అధికారులు అర్హతలు, దరఖాస్తు విధానంపై స్పష్టత ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల చొరవ అవసరం

సౌర విద్యుత్తు పథకాలు, వాటి ప్రయోజనాలపై ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పూర్తి అవగాహనను ప్రజల్లో కల్పించాలని కార్యక్రమంలో పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందించి, పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అందరూ కలిసి పనిచేస్తే సౌర విద్యుత్తు వినియోగాన్ని మరింత విస్తరించవచ్చన్నారు.



పర్యావరణానికి మేలు

సౌర విద్యుత్తు కాలుష్యాన్ని తగ్గించే పునరుత్పాదక ఇంధన వనరు. సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇది దోహదపడుతుంది. భవిష్యత్ తరాల కోసం గ్రామాలు సౌర విద్యుత్తు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని వక్తలు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం కీలకం

రామేశ్వర్ పల్లిని సౌర విద్యుత్తు వినియోగంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పథకాలతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమని నిర్వాహకులు తెలిపారు. ప్రతి కుటుంబం తమ అవసరాలకు అనుగుణంగా సౌర విద్యుత్తును వినియోగించేందుకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్, కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జి. సునీత, కె. శ్రీకాంత్, డాక్టర్ టి. ప్రతిజ్ఞ, రామేశ్వర్ పల్లి సర్పంచ్ చేపూరి రాణిరాజు, ఉపసర్పంచ్ వినోద్ గౌడ్, అంకోల్ క్యాంప్ సర్పంచ్ బి. రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, వీవీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నాగర్తి రమేష్‌రెడ్డి, మాజీ వీవీసీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నాగర్తి భూమ్ రెడ్డి, ఐకేపీ సీసీ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, గ్రామ కార్యదర్శి శ్యామ్, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు, సొసైటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.అంకోల్ క్యాంపు గ్రామాల్లో ప్రతి ఇంటిపై సోలార్ సిస్టమ్.



సౌర విద్యుత్తుతో గ్రామాలకు భవిష్యత్ భరోసా

డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్



సౌర విద్యుత్తు వినియోగంతో విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్ తెలిపారు. గ్రామాల్లో సౌర విద్యుత్తుపై అవగాహన పెంచి, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. రామేశ్వర్ పల్లిని ఆదర్శ సౌర గ్రామంగా తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ సహకారం అందిస్తుందని తెలిపారు.

ఐదేళ్ల క్రితమే వంద శాతం సోలార్

బి రాము, అంకోల్ క్యాంప్ సర్పంచ్



అంకోల్ క్యాంప్ గ్రామాన్ని ఐదేళ్ల క్రితమే వంద శాతం సౌర విద్యుత్తు వినియోగించే గ్రామంగా తీర్చిదిద్దామని బి. వెంకట రమణ తెలిపారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశామని చెప్పారు. అంకోల్ క్యాంప్ స్ఫూర్తితో రామేశ్వర్ పల్లి కూడా సౌర గ్రామంగా ఎదగాలని ఆకాంక్షించారు.

సౌర విద్యుత్తుతో కుటుంబాలకు మేలు

మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



సౌర విద్యుత్తుతో పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాల విద్యుత్ ఖర్చులు తగ్గుతాయని మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు చేరేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రామేశ్వర్ పల్లి ఆదర్శ సౌర గ్రామంగా ఎదగాలని ఆకాంక్షించారు.

రైతులు సోలార్ వైపు రావాలి

బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్



వ్యవసాయంలో సౌర విద్యు త్తు వినియోగాన్ని పెంచితే రైతులకు దీర్ఘకాలిక ప్రయో జనాలు కలుగుతాయని బ ద్దం ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సాగు అవసరా లకు సౌర ఆధారిత పరికరాలను వినియో గించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంజాయి కలిగిఉన్న ఐదుగురు యువకుల అరెస్ట్

కమలాపూర్,(సింగిడి):శనిగరం గ్రామ శివారులో గంజాయి కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారినుండి 50 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని స్థానిక సి ఐ పి నవీన్ తెలిపారు. సి ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం పోలీసులకు అందిన సమాచారం మేరకు కమలాపూర్ పోలీస్ వరంగల్ ఈగల్ ఫోర్స్ సిబ్బంది క శనిగరం గ్రామ శివారులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలలో శనిగరం గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక వైపు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో, అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద 50 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయి లభించిన వ్యక్తులలో గూడల గౌతమ్(18), నిగ్గల రాజు(27),వొట్టెముల కార్తిక్ (23), తట్ల శ్యామ్(18) శనిగరం, మండల గౌతమ్ (35)లక్ష్మీపూర్ ,గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి వారివద్దనుండి 50 గ్రాముల గంజాయి, ఐదు సెల్ ఫోన్ లను స్వాదినం చేసుకున్నామన్నారు.గంజాయి ఎక్కడి నుండి తీసుకువచ్చారు, దాని సరఫరా వెనుక మరెవరైనా ఉన్నారా అనే విషయాలపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందన్నారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అలాగే తమ ప్రాంతంలో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, సరఫరా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సి ఐ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనంతగిరి మధు , కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మోహన్, ఉదయ్ కుమార్, భాస్కర్, వెంకటేష్, సాంబమూర్తి,పాల్గొన్నారు.



ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే బర్త్ రఫ్ చేయాలి

రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా కాంగ్రెస్ రాస్తారోకో

తొర్రూరు,(సింగిడి):ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 13 కోట్ల పైగా ఓటర్లను తొలగించి ఓటు చోరీకి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఆందోళన చేస్తుండగా పోలీసులు అరెస్టు చేయడంతో కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ కమిటీల ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ లు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపికి తొత్తుగా పనిచేస్తున్నాడని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో వందలాది మంది ఎంపీలతో కలిసి మార్చ్ నిర్వహించగా భారీగా పోలీసులను మోహరించి రాహుల్ గాంధీని రెండుసార్లు అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.జ్ఞానేష్ కుమార్ బిజెపికి లాభం చేకూర్చేలా ఓట్లను తొలగించడం జరిగిందని, బిజెపికి వత్తాసు పలుకుతున్న జ్ఞానేష్ కుమార్ ను వెంటనే బర్త్ రఫ్ చేయాలని,ఆయనను దేశద్రోహిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యాన్ని ఖని చేసే విధంగా ప్రవర్తించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, చెవిటి సదకర్, జక్కుల రామ్ రెడ్డి, జాటోత్ రవి నాయక్,బచ్చలి లక్ష్మణ్, ఎడ్ల వెంకట్‌రెడ్డి,కర్ర అశోక్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, నల్లపు రాజు,సురేందర్,మనోహర్, గూడెల్లి వెంకన్న, రాఘవులు, చిదిరాల రవి,ఎనగందుల శ్రీనివాస్,బిజ్జాల అనిల్, ఎర్ర మల్లారెడ్డి, మంగళపల్లి స్వామి, చిన్న కోటయ్య, భూతం భరత్,నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.



వరికి బాక్టీరియా ఎండు తెగులు..

రైతులు అప్రమత్తం!

పొట్యాల, సోమనపల్లి శివార్లలో పంటల పరిశీలన

తెగులు వ్యాప్తి చెందకుండా నీటి పారుదలపై ప్రత్యేక జాగ్రత్తలు



గోదావరిఖని (సింగిడి): :అంతర్గం మండలం లోని పొట్యాల, సోమనపల్లి గ్రామాల శివారు ప్రాంతాల్లో వరి పంటకు సోకిన బాక్టీరియా ఎండు తెగులును వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు.
పంటలో తెగులు లక్షణాలను గుర్తించిన అధికారులు రైతులకు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.తెగులు కనిపించిన వెంటనే యూరియా, అమ్మోనియా వంటి నత్రజని సంబంధిత ఎరువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. పంటకు పొటాష్ అందించే ఎరువులను వినియోగించడం ద్వారా మొక్కల బలాన్ని పెంచుకోవాలని తెలిపారు.తెగులు సోకిన మడి నుంచి ఇతర మడులకు నీరు వెళ్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నీటి పారుదల ద్వారా తెగులు ఇతర పొలాలకు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రభావిత పొలాల వద్ద ప్రత్యేక అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు.బాక్టీరియా ఎండు తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ ం టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ కలిగిన మందును ఎకరాకు 150 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా కాసుగామైసిన్ ం కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిగిన మందును ఎకరాకు 300 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు.రైతులు వరి పొలాలను తరచూ పరిశీలిస్తూ తెగులు లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వ్యాధి తీవ్రత పెరగకముందే సూచించిన నివారణ చర్యలు చేపట్టి పంట నష్టాన్ని తగ్గించుకోవాలని కోరారు.

ఆదివాసీ నాయక్ పోడ్ సంఘం నూతన కమిటీ ప్రకటన



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం (ది.నం 141/2015) నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం నాడు ఏకగ్రీవంగా ప్రకటించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంక గారి భూమయ్య, ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా కార్యదర్శి సొండి శివ శంకర్ ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీ నియామకం చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జిల్లాలోని ఆదివాసీల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నూతన కార్య వర్గం నిరంతరం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గం వివరాలు:
గౌరవ అధ్యక్షులు: మేకల శంకర్ (నర్సాపూర్), జిల్లా అధ్యక్షులు: సాకి లక్ష్మణ్ (నిర్మల్), కార్యనిర్వాహక అధ్యక్షులు: సార్ల నరసయ్య (ఖానాపూర్) రాజుల నారాయణ (నిర్మల్), ప్రధాన కార్యదర్శి: సుంకరి ముత్యం (సోన్),కోశాధికారి: గుంజర్ల సాయి (భైంసా)ఉపాధ్యక్షులు: సుంచు శ్రీనివాస్ (మామడ), సుంచు నవీన్ (సోన్), ముచ్చింద్ల రమేష్ (నిర్మల్),లింగాల శ్రీనివాస్ (నర్సాపూర్),సాంస్కృతిక కార్యదర్శి: పోతరాజు శ్రీనివాస్ ,సంయుక్త కార్యదర్శులు:దొడ్డిల శ్రీనివాస్ (మామడ), జంగిలి రాకేష్ (సోన్)కార్యదర్శులు:సుంచు సత్యనారాయణ (మామడ), సురపు భోజన్న , గుమ్ముల శ్రీనివాస్ (కుంటాల).గౌరవ సలహాదారులు:మంద మల్లేష్, సొండి శివశంకర్, సురపు సాయన్న, బండారి తక్కన్న, భోసాని రాజేశ్వర్.నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా కార్యవర్గానికి సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు

24 గంటల కరెంటు హామీ ఎక్కడ..?

విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు...
ఎలినోవా ప్రభావంతో రైతులు ఉక్కిరిబిక్కిరి....
రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వానిదే బాధ్యత:
టీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు పొన్నమనేని బాలాజీరావు...



సుల్తానాబాద్, (సింగిడి): రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చరణ లో పూర్తిగా విఫలమైందని టీఆర్ఎస్ రా ష్ట్రరైతు విభాగం అధ్యక్షుడు పొన్నమనేని బాలాజీరావు విమర్శించారు. ప్రస్తుతం రైతులకు ఐదు నుంచి ఆరు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవు తుండటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఎలినోవా ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, మరోవైపు విద్యుత్ కోతలు, సాగునీటి కొరత రైతులను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని బాలాజీరావు అన్నారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ నుంచి సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నష్టపోయే రైతులకు వెంటనే పరిహారం అందించాలని కోరారు.

కాళేశ్వరం నీరు అందించడంలో విఫలం....

కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల్లో ఉండటం తోనే సాగునీటి సమస్య తీవ్రతరమైందని బాలాజీ రావు పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కాళేశ్వరం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించి ఉంటే రైతులకు ప్రస్తుత పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు. ఇకనైనా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేసి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కోతలను వెంటనే ఎత్తివేసి, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సాలేంద్ర కొమురయ్య, జిల్లా నాయకులు బొంగోని శంకరయ్య గౌడ్, ఊట్ల శ్రీనివాస్, మండల నాయకులు మల్యాల కరుణాకర్‌తో పాటు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో రానున్నది తాగునీటి సంక్షోభమేనా..?







అడుగంటుతున్న భూగర్భ జలాలు..
ఎండిపోతున్న బోర్లు, బావులు
ఎస్సారెస్పీ కెనాల్ నీరు లేక ఎండుతున్న పంటలు..
ముందస్తు చర్యలు ఎక్కడ..?



బుగ్గారం,(సింగిడి): వేసవి ఇంకా పూర్తిగా మొదలుకాకముందే బుగ్గారం మండలంలో నీటి కష్టాలు మొదలయ్యాయని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోర్లు, బావుల్లో నీరు తగ్గిపోతోందని చెబుతున్నారు. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న వేసవిలో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ముందే మొదలైన నీటి కష్టాలు

వేసవి కాలం పూర్తిగా రాకముందే మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో తాగునీటి కోసం ఇప్పటి నుంచే ఇబ్బందులు మొదలవుతున్నాయని అంటున్నారు. ఉన్న నీటి వనరులు కూడా క్రమంగా అడుగంటుతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సుమారు 10 గ్రామాల్లో 24 బావులు ఎండిపోయాయనే సమాచారం

బుగ్గారం మండలంలోని సుమారు పది గ్రామాల్లో 24 బావులు ఇప్పటికే ఎండిపోయినట్లు స్థానికుల నుంచి సమాచారం అందుతోంది. మరికొన్ని బావుల్లో కూడా నీటి మట్టం గణనీయంగా తగ్గినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మిగిలిన నీటి వనరులపైనా ప్రభావం పడే అవకాశం ఉందని అంటున్నారు.

బోర్లలోనూ తగ్గుతున్న నీరు

భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పలు గ్రామాల్లో బోర్లలో నీటి లభ్యత తగ్గిపోతోందని రైతులు, గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో తక్కువ లోతులోనే నీరు పడేదని, ఇప్పుడు మరింత లోతుకు వెళ్లినా ఆశించినంత నీరు రావడం లేదని అంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తాగునీటి అవసరాలకు కూడా బోర్లపై ఆధారపడటం కష్టమయ్యే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీ కెనాల్ నీరే కీలకం

మరోవైపు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పంటలకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. నీరు అందక పంటలు ఎండుముఖం పడుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న పంటలకు చీడపీడలు, పురుగుల బెడద కూడా తోడవడంతో రైతులకు మరింత నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతన్నకు రెట్టింపు నష్టం

ఒకవైపు సాగునీటి కొరత.. మరోవైపు పంటలను ఆశిస్తున్న చీడపీడలు. దీంతో రైతన్నకు కష్టాలు రెట్టింపవుతున్నాయి. పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసినా నీరు లేక పంటను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు నీటి సమస్యపై ముందస్తుగా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

మండుతున్న ఎండలు.. పెరుగుతున్న నీటి అవసరం

మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్లలో కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో నీటి అవసరం కూడా మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. వేసవి కాలం మొదలయ్యేలోపే తాగునీటి అవసరాలను అంచనా వేసి ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

మిషన్ భగీరథపైనే ఆశలు

గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే అవసరమైన ప్రాంతాలన్నింటినీ మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో అనుసంధానం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో పాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను కూడా ముందుగానే సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎల్‌నినో పేరుతో కాకుండా.. వాస్తవ పరిస్థితులపై దృష్టి

భూగర్భ జలాలు తగ్గిపోవడానికి వర్షపాతం, భూగర్భ జలాల వినియోగం, సాగునీటి పరిస్థితులు, వాతావరణ మార్పులు తదితర అంశాలు కారణమయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని కేవలం ఎల్‌నినో ప్రభావంగా కాకుండా శాస్త్రీయంగా పరిశీలించి వాస్తవ కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

ప్రభుత్వం ఇప్పుడే మేల్కొనాలి...

తాగునీటి సమస్య ముదిరిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో బావులు, బోర్ల పరిస్థితిని అధికారులు పరిశీలించి వివరాలు సేకరించాలని, ఎక్కడెక్కడ నీటి కొరత వచ్చే అవకాశం ఉందో ముందుగానే గుర్తించాలని సూచిస్తున్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పాటు చేయడంతో పాటు, పరిస్థితి తీవ్రంగా ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు కూడా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. తాగునీరు.. సాగునీరు రెండింటి విషయంలోనూ ఇప్పుడే జాగ్రత్త పడకపోతే రేపటి నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉందని బుగ్గారం మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది తెలంగాణ పల్లె వాతావరణం కనిపించేలా, "వాపోతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...

మోర్తాడ్ మండల పోలీసులు వెల్లడి..



ఆర్మూర్ , (సింగిడి): సైబర్ నేరాలు సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్ది కొద్దీ రూపాల్లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని బ్యాంక్ ఖాతాదారులు, తల్లిదండ్రులు, యువకులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మోర్తాడ్ మండల పోలీసులు ఆర్మూర్ బస్టాండ్ లో ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. గురువారం రోజున మోర్తాడ్ బస్టాండ్ లో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బైకులు ఇవ్వవద్దని, తమ పిల్లలు కాలేజీలకు, పాఠశాలలకు వెళ్తున్నారా లేదా అనే విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మత్తు పదార్థాలు లాంటి, లాంటి బానిసలకు గురి కాకుండా తల్లిదండ్రులే ప్రతిక్షణం విద్యార్థుల తీరుపై, కదలికలపై గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ పోలీసులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



మహాదేవపూర్ (సింగిడి): పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుడుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ అన్నారు. గురువారం మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించి ఎస్సై, స్టేషన్ రైటర్, సీసీటీ ఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్లైన్ వివరాల నమోదు రికార్డుల అప్లోడ్ ప్రక్రియను, స్టేషన్ పరిధిలో తరచుగా నమోదయ్యే నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతి భద్రతలు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడు స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిం చాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనకి చేస్తూ వారి కదలికలు కార్యకలాపాలపై నిరంతరాన్నిగా ఉంచాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు పకడ్బంది చర్యలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ లో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని వివరించారు.



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీదేవి

కాగజ్ నగర్ (సింగిడి):: కాగజ్ నగర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల లో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ , మహిళా సాధికారత సెల్ ఉమ్మడి సమన్వయంతో బతుకమ్మ సంబరాలు గురువారం అత్యంత ఘనంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీదేవి మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న బతుకమ్మ పండుగ సాంప్రదాయాలు మన తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగం. పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది. ఈ సాంప్రదాయాలను గౌరవిస్తూ ముందడుగు వేయాల్సిన బాధ్యత నేటి తరం విద్యార్థులపై ఎంతైనా ఉంది అని పేర్కొన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను, దాని వెనుక ఉన్న చారిత్రక, సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు కూలంకషంగా వివరించారు కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ ఈ బతుకమ్మ పండుగ అందరి జీవితాల్లో సంతోషాలను, వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ మరియు మహిళా సాధికారత విభాగం ఇన్చార్జి రోస్ మేరీ ల నేతృత్వంలో ఈ వేడుకలు దిగ్విజయంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని పూల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు



ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

బుచ్చిరెడ్డిపల్లిలో కలకలం..
విగ్రహం, గంటలు అపహరణ.



నల్లబెల్లి, (సింగిడి): నల్లబెల్లి మండలంలోని బుచ్చిరె డ్డిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వా మి ఆలయంలో గుర్తుతెలి యని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సమాచా రం. ఆలయంలో ఉన్న వినాయకుడి విగ్రహం, గంటలు, పూజా సామగ్రి అపహరణకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో కలకలం నెలకొంది. ఆలయంలో చోరీ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఆలయ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తుల కదలికలు ఉన్నట్లు స్థాని కంగా చర్చ జరుగుతోంది. దీంతో ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి వేళ ఏం జరుగుతోం దనే,అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పవిత్రమైన ఆల యంలో చోరీ జరగడంపై గ్రామస్థులు ఆందో ళన చెందుతున్నారు. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ఆలయ పరిసరాల్లోని పరిస్థితులను పరిశీలించి, చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని,కోరుతున్నారు. అవసరమైతే సీసీ కెమెరాల ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలించి నింది తులను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆలయానికి రాత్రి వేళల్లో భద్రత కల్పించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలి కలపై నిఘా పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఘటనకు సంబంధించి పోలీసుల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అటవీ అధికారుల నోటీసులతో

నిరుపేదల్లో ఆందోళన

సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): నాగారం ప్రాంతవా సులకు దొడ్డి కొమురయ్య నగర్, విష్ణు నగర్ బహుజన కాలనీ, అసద్ బాబానగర్ ఏరియాలలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఫారెస్ట్ ఆఫీసర్లు గత రెండు మూడు రోజులుగా నోటీసులు ఇచ్చి ఏడు రోజుల్లో గా ఖాళీ చేయకపోతే గుడి సెలు తొలగిస్తామని ప్రజల్ని భయ భ్రాంతులకు గురి చేయడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, నగర కార్యదర్శి బి.సుజాతలు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలకు పైగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నటువంటి నిరుపేదలని నోటీసులు ఇచ్చి ఖాళీ చేయడం తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికే సిసి రోడ్లు, కరెంటు స్తంభాలు, మీటర్లు, మంచినీటి కలెక్షన్లు, మురికి కాలువలు ఇలా అనేక నిర్మాణాలు జరిగినప్పటికీ ఇప్పుడు ఫారెస్ట్ ఏరియా అని ప్రజలను మనోవేదనకు గురి చేస్తున్నారని అన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్స్ ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకొని ప్రజల మనోవేదనకు పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇస్తామని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బలవంతంగా ఇల్లు తొలగించి నిరుపేదలను ఇబ్బంది పెట్టే పరిస్థితి వస్తే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఈ పోరాటాల్లో జరగబోయే పరిణామాలకి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు రజియా మాజిత, యశోద, జై శ్రీ, దీక్షిత, పంచ పూల, నాస్మిన్, సుందర్,సంగీత, అంజయ్య, కాంత లక్ష్మి గుడిసె నివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరణ పద్ధతుల్లో రైతులు పంటలు పండించాలి

కమలాపూర్,(సింగిడి): మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్ద గురువారం ఎస్ ఆర్ యూనివర్సిటీ బిఎస్సి (అగ్రికల్చరల్) ఫైనల్ ఇయర్ విద్యార్థులు కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కిసాన్ మేళాలో రైతులకు వ్యవసాయంలో ఉపయోగ పడే యంత్రాలు,రైతులు పండించే పంటలలో తీసుకోవాల్సిన పద్ధతులపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ రైతులు పండించే పంటలలో ఆధునీకరణ పద్ధతులు ఉపయోగించి తక్కువ సమయంలో పెట్టుబడి తక్కువ, ఎక్కువ దిగుబడి వచ్చే విదంగా వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సినీ నటుడు సెల్వరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్ ,వ్యవసాయ శాఖ ఏడిఏ ఆదిరెడ్డి, ఎంపీడీవో గుండె బాబు,మండల వ్యవసాయ అధికారి బి వేణు, సర్పంచ్ పబ్బు సతీష్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్, మాట్ల రమేష్, తడక



శ్రీకాంత్, విష్ణు దాసు వంశీధర్ రావు, పోడేటి బిక్షపతి, బొల్లం రాజిరెడ్డి, నాంపల్లి ప్రభాకర్, మార్కెట్ డైరెక్టర్లు జనగాని శివకృష్ణ, సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్ ఆకిన పెళ్లి బిక్షపతి, కిన్నర కృష్ణమూర్తి, గూడెపు మొగిలయ్య,పుల్ల శోభన్, మాట్ల కళ్యాణ్, వసంతరావు, పుల్ల ఐలయ్య, జన్ను బిక్షపతి మాట్ల రాజేష్,పలు గ్రామాలకు చెందిన రైతులు,తదితరులు పాల్గొన్నారు.

దసరా సందర్భంగా ఇసుక లారీల రాకపోకలు నిలిపివేయాలి

ఈ నెల 10 నుంచి 21 వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ విజ్ఞప్తి

ములుగు ప్రతినిధి, (సింగిడి): దసరా నవరాత్రుల సందర్భంగా మంగపేట మండలంలో ఇసుక లారీల రాకపోకలను ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ సంబంధిత అధికారులను కోరారు. తెలంగాణలో అత్యంత ముఖ్యమైన పండుగల్లో ఒకటైన దసరా నవరాత్రులు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో ప్రజలు కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు, వివిధ ప్రాంతాలకు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దసరా పండుగ సమయంలో ఇసుక లారీల రాకపోకల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రజల నుంచి తమ ట్రస్ట్‌కు అనేక విజ్ఞప్తులు అందుతున్నాయని తెలిపారు. ప్రజల ఇబ్బందులు, ప్రయాణికుల భద్రత, విలువైన ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా, మండల స్థాయి అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మంగపేట మండల పరిధిలో ఇసుక లారీల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ తరఫున అధికారులకు విజ్ఞప్తి చేశారు.



11 నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

హన్మకొండ, (సింగిడి): చారిత్రా త్మకమైన వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈనెల 11 తేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామల సునీత తెలిపారు. గురువారం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియా తో మాట్లాడారు. బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతా యన్నారు. ఆలయంలో మొట్టమొదటిసారిగా కోటి రూపాయల ఖర్చుతో మాడవీధులలో ఏడవ రోజు రథోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి వసతి లేనందున తెప్పోత్సవం ఆంతరంగికంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచి నీటి వసతులు, ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో పాండాలు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్ ఇతర శాఖల సమన్వయంతో పనుల నిర్వహణ జరుగుతుందని చెప్పారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఈవో సునీత కోరారు. అలాగే ఆలయ అర్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూఎ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరం

- మండల పార్టీ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్



డోర్నకల్/మరిపెడ (సింగిడి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మరిపెడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుబులోత్ రవి నాయక్ అన్నారు. గుండెపుడి గ్రామంలో చిన్న బోయిన వీరబాబు బైక్ యాక్సిడెంట్ అయి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుడుకి మంజూరైన దాదాపు రూ. 1,18,400/- చెక్కును మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు రవి నాయక్ గుండెపుడి గ్రామ అధ్యక్షుడు గడ్డం దామోదర్ రెడ్డి బాధిత కుటుంబానికి గురు వారం మరిపెడ ఎమ్మెల్యే భవనంలో లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపే దలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను సీఎంఆర్ఎఫ్ కోసం వెచ్చించిందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నాయకులు,గడ్డం వెంకట్ రెడ్డి,సురబోయిన ఉప్పల య్య, రేఖ శ్రీనివాస్, పెద్దపులి శ్రీను ,రేఖ నరేష్ గౌడ్, ఏక స్వామి బోడపట్ల నరేష్, రేఖ ఉప్పలయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

భూహక్కుల కొత్త భరోసా భూభారతీ

- కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు



డోర్నకల్ /మరిపెడ (సింగిడి): భూభారతి ద్వారా భూములకు సంబంధించిన రికార్డులను మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు అన్నారు. గురువారం మండలంలోని బురహన్ పురం గ్రామంలో భూభారతి సర్వేను పైలెట్ ప్రాజెక్ట్ గా మండల తహసీల్దార్ కృష్ణవేణితో కలసి అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూ రికార్డుల్లోని లోపాలు, హక్కుల విషయంలో వివాదాలు, రికార్డుల మార్పుల్లో ఆలస్యం వంటి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా భూ భారతి ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని వివరించారు. గత ప్రభుత్వం ధరణి తీసుకవచ్చి రైతులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ధరణి లోని లోపాలను సరిచేస్తూ, రైతులకు మంచి జరిగేలా రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో భూభారతీని ప్రభుత్వం తీసుక వచ్చిందని తెలిపారు. భూభారతీ సర్వేను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ సహకారంతో నియోజకవర్గంలోని భూ సమస్యలను భూభారతీతో రైతులు పరిష్కరించుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల వెంకటమ్మ, మచ్చ వెంకట రామ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతంలో అభివృద్ధి అడుగులు..!

ఎన్నో ఏళ్ల కలలకు శ్రీకారం..!

మారుతున్న హుస్నాబాద్ రూపురేఖలు

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో బహుముఖ అభివృద్ధి పనులకు ఊపు

సాగు.. తాగునీరు.. విద్య.. వైద్యం.. రవాణా.. పర్యాటకం.. క్రీడలు.. అన్ని రంగాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం.

హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై నినాదం ప్రత్యేక కథనం.









హుస్నాబాద్, (సింగిడి): హుస్నాబాద్ ప్రాంతం అంటేనే ఒకప్పుడు కరువుకు పెట్టింది పేరు. మెట్ట ప్రాంతం కావడంతో సాగు, తాగునీటి కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కురిస్తేనే పంట.. వర్షాలు లేకపోతే రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారే పరిస్థితులు ఉండేవి. వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగించాయి. ప్రభుత్వాలు మారాయి.. పాలకులు మారారు.. కానీ హుస్నాబాద్ ప్రాంతం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదన్న భావన ప్రజల్లో ఉండేది. అయితే 2023 తర్వాత నియోజకవర్గంలో వివిధ రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు కొత్త ఊపు కనిపిస్తోంది. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై దృష్టి సారిస్తున్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి

హుస్నాబాద్ ప్రాంత రైతుల ఎన్నో ఏళ్ల కల అయిన గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కావడం నియోజకవర్గ అభివృద్ధిలో కీలక అంశంగా మారింది. సాగునీరు అందుబాటులోకి వస్తే వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే పరిస్థితి తగ్గి రైతులకు ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కాలువల నిర్మాణం, భూసేకరణ, రైతులకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతానికి సాగునీటి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయి.

రైతుల కోసం వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ

వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పంటల సాగు విధానం, తెగుళ్ల నివారణ, పంటల సంరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులకు ఏ సమస్య వచ్చినా వ్యవసాయ అధికారులను సంప్రదించి పరిష్కారం పొందే విధంగా వ్యవస్థను మరింత చేరువ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మంత్రి పొన్నం చొరవతో ఎల్లమ్మ చెరువుకు కొత్త రూపం

హుస్నాబాద్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా ఉన్న ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి శ్రీకారం చుట్టడం మరో కీలక పరిణామంగా మారింది. చెరువులో హృదయాకారంలో గాజు వంతెన నిర్మాణం చేపట్టడంతో పాటు చెరువు పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. చెరువు వద్ద నడకదారులు, పచ్చదనం, పిల్లల కోసం వసతులు, ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పొన్నం ప్రభాకర్ ఆలోచనలకు ప్రతిరూపంగా సిద్దిపేట--హనుమకొండ రహదారుల సుందరీకరణ

హుస్నాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా సిద్దిపేట, హనుమకొండ ప్రధాన రహదారులపై ఇప్పటికే క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించే విగ్రహాలతో పాటు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా యోగాసనాలను ప్రతిబింబించే విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. క్రీడలు, శారీరక దారుఢ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు సందేశం అందించేలా ఈ ఏర్పాట్లు ఉన్నాయి. హుస్నాబాద్‌లో క్రీడాకారుల విగ్రహాల ఏర్పాటుపై మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో పరిశీలన నిర్వహించినట్లు నివేదికలు వెల్లడించాయి.

గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లకు మంత్రి పొన్నం ప్రాధాన్యం

పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిధులతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు కోసం చర్యలు చేపడుతున్నారు. యువత వ్యాయామం, క్రీడల వైపు మళ్లేలా చేయడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ వసతులను కల్పిస్తున్నారు. ఎల్లమ్మ చెరువు అభివృద్ధిలోనూ ఓపెన్ జిమ్ ఏర్పాటు అంశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

క్రీడలకు పెద్దపీట.. యువతకు కొత్త అవకాశాలు

హుస్నాబాద్ నియోజకవర్గంలో యువతకు క్రీడా అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. క్రీడా వసతులు, వ్యాయామ సౌకర్యాలు పెంచడంతో పాటు యువతను క్రీడలు, చదువుల వైపు మళ్లించేలా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. హుస్నాబాద్‌లో క్రీడా మైదానాలు, క్రీడా వసతుల అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

మంత్రి పొన్నం చొరవతో విద్యారంగంలో కొత్త అధ్యాయం

ఇంజనీరింగ్ విద్య కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేలా హుస్నాబాద్‌లో శాతవాహన విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కీలక పరిణామంగా మారింది. కళాశాల నిర్మాణంతో పాటు బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణానికి కూడా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మాపూర్‌లో వసతి గృహాల నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన జరిగింది. విద్యార్థుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు కొత్త కోర్సులు తీసుకురావాలనే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

వైద్య రంగంలోనూ అభివృద్ధి అడుగులు

హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంచే పనులతో పాటు ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయి.

మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం.. మంత్రి పొన్నం దృష్టి

రవాణా శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలోని రవాణా సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు రాకపోకలు సులభతరం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త బస్సు సేవలు ఏర్పాటు చేయనున్నట్లు కూడా మంత్రి ఇటీవల వెల్లడించారు.

మంత్రి పొన్నం పర్యవేక్షణలో పట్టణ సుందరీకరణ

హుస్నాబాద్ పట్టణానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులు, చెరువులు, కూడళ్ల సుందరీకరణకు చర్యలు చేపడుతున్నారు. సిద్దిపేట, హనుమకొండ వైపు వెళ్లే ప్రధాన మార్గాలపై ఇప్పటికే ఏర్పాటు చేసిన క్రీడా, యోగా విగ్రహాలు పట్టణానికి ప్రత్యేక రూపాన్ని తీసుకువచ్చాయి. ఎల్లమ్మ చెరువు, కొత్త చెరువు, పల్లె చెరువు వంటి ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణపై కూడా మంత్రి అధికారులతో సమీక్షలు నిర్వహించారు.

'పల్లె పల్లెకు పొన్నమన్న'తో ప్రజల వద్దకు మంత్రి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'పల్లె పల్లెకు పొన్నమన్న' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు, గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై కూడా గ్రామస్థాయిలో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఏడు మండలాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్య, వైద్యం, రవాణా, వ్యవసాయం, క్రీడలు, పర్యాటకం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను సమన్వయం చేస్తూ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

మారుతున్న హుస్నాబాద్ రూపురేఖలు

ఒకప్పుడు కరువుకు మారుపేరుగా ఉన్న హుస్నాబాద్ ప్రాంతంలో ఇప్పుడు అభివృద్ధి పనులు ఒక్కో రంగాన్ని తాకుతున్నాయి. గౌరవెల్లి ప్రాజెక్టుతో సాగునీరు, ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో పర్యాటకం, ఇంజనీరింగ్ కళాశాలతో విద్య, వైద్య సదుపాయాల విస్తరణతో ప్రజలకు ఆరోగ్య భరోసా, మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యంతో రవాణా, సిద్దిపేట--హనుమకొండ రహదారులపై ఏర్పాటు చేసిన క్రీడా, యోగా విగ్రహాలతో పట్టణ సుందరీకరణ, గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లతో ఆరోగ్య వసతులు, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణతో రైతులకు సేవలను చేరువ చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పుడే వాటి ఫలితాలు స్పష్టంగా కనిపించనున్నాయి. సాగునీరు, విద్య, వైద్యం, రవాణా, క్రీడలు, పర్యాటకం, వ్యవసాయం వంటి రంగాల్లో చేపడుతున్న పనులు పూర్తయితే హుస్నాబాద్ నియోజకవర్గ రూపురేఖల్లో మరింత మార్పు కనిపించే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పలు అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధి దిశగా కొత్త అడుగులు వేస్తోంది.

ఓట్ల తొలగింపుపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును ప్రశ్నించిన శ్రీహరి రావు

నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): దేశంలో కోట్లాది మంది ఓటర్ల ఓట్లను తొలగించి, రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు ఆరోపించారు. ఢిల్లీలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. శ్రీహరి రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సర్వే పేరుతో ఎస్ఐఆర్‌ను అమలు చేస్తూ ఓటర్ల జాబితాలో భారీగా కోత పెట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ కలిసి ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ఏకపక్షవైఖరి దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇండియా







కూటమి ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన నిరాహార దీక్షలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జునైద్ మెమన్, వివిధ మండలాల అధ్యక్షులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు ఇంద్రకరణ్ రెడ్డి సంఘీభావం తెలిపారు, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, నిర్మల్ సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్లు సోమ భీమ్ రెడ్డి అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇండియా కూటమి లో భాగంగా సిపిఐ నాయకులు రాజన్న, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ధర్మారం (సింగిడి): మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో ఈ రోజున 250 ఎల్.ఫి. హెచ్ సామర్థ్యం, ఐదువందల లీటర్ల నిల్వ సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఏ.జమునారాణి రిబ్బన్ కట్ చేసి ఘనంగ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన త్రాగునీరు వలన విద్యార్థులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందనీ,తరచూ అనారోగ్యానికి గురికాకపోవడం వల్ల పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతారనీ,డీ హైడ్రేషన్ తగ్గి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందనీ,స్వచ్ఛమైన నీరు శరీర పెరుగుదలకు, మెదడు చురుకుగా పనిచేయడానికి తోడ్పడుతుందనీ,అలసట, తలనొప్పి తగ్గుతుందనీ,చిన్న వయస్సు నుండే పరిశుభ్రమైన నీరు తాగడం వలన ఆరోగ్యకరమైన అలవాట్లు అలవడతాయనీ అన్నారు.. ముఖ్యంగా ఆర్వో నీరు వల్ల ఫ్లోరైడ్, ఉప్పు శాతం తగ్గి, పిల్లలకు సురక్షితమైన తాగునీరు అందుతుందనీ తెలిపారు. ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ ఉమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ కరీంనగర్ వారిచే ఎఫ్.డి.ఎన్.ఎఫ్ ఆర్గనైజేషన్ స్విట్జర్లాండ్ సహకారంతో విరాళంగా అందించబడింది,ప్రాథమిక పాఠశాలలో నెలకొల్పిన ఈ ప్లాంట్ ద్వారా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల,అంగన్వాడి కేంద్రం లోని దాదాపు మూడు వందల మంది విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి రానుంది. విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ వాటర్ ప్లాంట్ ప్రారంభించటం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు,



యూత్ క్లబ్ సభ్యులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రా మ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్,ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు నూతి మల్లన్న, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు సరిత, అంగన్వాడీ టీచర్ వినోద,చొప్పదండి ఉన్నత పాఠశాల పిజికల్ డైరెక్టర్ కృష్ణ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ ఏలేటి పద్మ లచ్చి రెడ్డి,ఉపాధ్యాయులు శ్రీలత, ఏ. శారద, మల్లిక,కె.ప్రసాద్, గోపాల్, శారద,రజిత, విద్యావాలంటీర్ లు అరుణశ్రీ, సౌజన్య,కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట మండల అభివృద్ధికి మరో ముందడుగు

రూ.6.80 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం
మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

ములుగు ప్రతినిధి, (సింగిడి): మంగపేట మండల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ముందుచూపుతో మంగపేట మండలంలోని గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ. 6.80 కోట్లు మంజూరయ్యాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా బలన్నగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ.. మంగపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేని పరిస్థితి లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మంగపేట మండల అభివృద్ధికి వివిధ శాఖల ద్వారా అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తూ కృషి చేస్తున్న మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మంగపేట మండల అభివృద్ధికి రూ. 6.80 కోట్ల ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ, నాయకులు చిన్నపెల్లి రాంబాబు, గంగినేని శేషగిరి, మోడెం సత్యం, తొలేం సు

క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





జిల్లా కలెక్టర్ కె .హరిత

కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): క్షయ వ్యాధిని నిర్మూలించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'క్షయ నిర్మూలనకు యువత సన్నద్ధం -- టీబీ ముక్త్ పంచాయతీల' సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్షయ అంటువ్యాధి కావడంతో లక్షణాలను తొలిదశలోనే గుర్తించి వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా చికిత్సతోపాటు పోషకాహారం అందిస్తే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. యువత, వైద్యులు, సర్పంచులు, పంచాయతీ పాలకవర్గాలు గ్రామాల్లో క్షయపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. టీబీ రహిత పంచాయతీలుగా ఎంపికైన గోవింద్‌పూర్, పోతేపల్లి, పవార్‌గూడ, సాంగ్వి, ఇటిక్యాలపహాడ్, దాబా గ్రామాల సర్పంచులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగేంద్ర, డీపీవో బిక్షపతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ఎంపీడీవోలు, సర్పంచులు, వైద్యులు, ఎస్సీసీ విద్యార్థులు, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

పవన్ కల్యాణ్ నా చిన్ననాటి క్రష్: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

'రణబాలి' ట్రైలర్ వచ్చేసింది!



విజయ్ దేవరకొండ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'రణబాలి' సినిమా దసరా కానుకగా థియేటర్లలోకి రానుంది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ మూవీలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, టీజర్, ఫస్ట్ సాంగ్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. ఇటీవల వచ్చిన డాక్యు సిరీస్ కూడా మంచి హైప్ తెచ్చి పెట్టింది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. 3 నిమిషాల 47 సెకండ్ల నిడివితో వచ్చిన 'రణబాలి' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. 1854 – 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో శింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించారు. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటించారు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ విలన్ పాత్ర పోషిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. అజయ్ – అతుల్ సంగీతం సమకూర్చారు. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ – రష్మిక కలిసి నటిస్తున్న సినిమా కావడం.. భార్యాభర్తలుగా మారిన తర్వాత వస్తున్న తొలి సినిమా కావడంతో అభిమానులు ప్రత్యేకంగా భావిస్తున్నారు. అక్టోబర్ 16న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానుంది.

సిన్మా సింగిడి
Cinma Singidi

శనివారం
10-10-2026



ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్లిపోవాల్సిందే

మరణానికి ముందు నానా పటేకర్ వ్యాఖ్యలు

ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలో ఆయనకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఒకటి ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. తన అకాల మరణానికి కేవలం మూడు రోజుల ముందే గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో పటేకర్? మాట్లాడారు. ఆ సమయంలో తనదైన శైలిలో మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్లిపోవాల్సిందే, రేపు నేను ఉంటానో లేదో నాకు తెలియదు. ఆ సమయం ప్రతి ఒక్కరి జీవితంలోనూ వస్తుంది. కానీ అది రాకముందే, 'నేను చేయాలనుకున్న పనిని చేయగలుగుతున్నానా? దాని కోసం ప్రయత్నం చేశానా?' అని మనం ఆలోచించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 4న గోవాలోని పనాజీ సమీపంలో ఉన్న డోనా పౌలాలో 'సమ్రాట్ క్లబ్ ఇంటర్నేషనల్' నిర్వహించిన కార్యక్రమంలో పటేకర్ ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన తన స్నేహితుడు, గోవా మాజీ ముఖ్యమంత్రి దివంగత మనోహర్ పారికర్‌ను కూడా స్మరించుకున్నారు. పారికర్ తనకంటే చిన్నవాడైనప్పటికీ, ఒక గొప్ప ఆశయంతో జీవించిన మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఈ లోకాన్ని విడిచి పెట్టేలోపు ఎంతో సాధించాలంటే మనిషిలో బలమైన సంకల్పం ఉండాలని నానా పటేకర్ చెప్పారు.



కార్యక్రమం అనంతరం, పటేకర్ స్థానిక బృందంతో కలిసి 'శమెల్' అనే సంప్రదాయ సంగీత వాయిద్యాన్ని వాయించడంతో పాటు, 'దేఖ్నీ' అనే స్థానిక నృత్య రీతిని కూడా ప్రదర్శించారు. మరోవైపు, నటుడు నానా పటేకర్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్రాల మంత్రులు విచారం వ్యక్తంచేశారు. నానా పటేకర్ మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్త చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్?లో పోస్టు పెట్టారు. తనదైన నటనాశైలితో తరతరాలు గుర్తుండిపోయే అద్భుతమైన పాత్రలను పటేకర్? ప్రేక్షకులకు అందించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. నటుడిగానే కాక తాను నమ్మిన విషయాన్ని నిర్భయంగా వ్యక్తపరిచేందుకు ఆయన ఏనాడూ సంకోచించలేదని, పటేకర్ సూటి అభిప్రాయాలకూ ప్రజల నుంచి ప్రశంసలు దక్కాయని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్? పోస్టులో రాసుకొచ్చారు.

అతనికి నేను ఒకే చెప్పేశా..

అతనికి నేను ఒకే చెప్పేశా.. టాలీవుడ్‌లో కథానాయికగా అడుగు పెట్టి దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న నటి అనుష్క శెట్టి. గ్లామర్ పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ముఖ్యంగా అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి, భాగమతి వంటి సినిమాలు అనుష్కకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే సినిమాల్లో ఎంత పాపులారిటీ ఉన్నప్పటికీ.. వ్యక్తిగత విషయాల విషయంలో మాత్రం అనుష్క చాలా ప్రైవేట్‌గా ఉంటారు. తన వ్యక్తిగత జీవితం గురించి పెద్దగా మాట్లాడేందుకు ఇష్టపడని ఈ స్వీటీ.. అప్పుడప్పుడు ఇంటర్వ్యూల్లో తన జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటుంటారు. అలాంటి ఓ సందర్భంలో ఆమె చెప్పిన చిన్ననాటి ప్రేమ జ్ఞాపకం ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్న అనుష్క.. తాను ఆరో తరగతిలో ఉన్నప్పుడు జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నట్లు సమాచారం. ఓ అబ్బాయి తన దగ్గరకు వచ్చి నేరుగా 'ఐ లవ్ యు' అని చెప్పాడట. అయితే అప్పటికి ప్రేమ అంటే ఏమిటో, 'ఐ లవ్ యు' అనే మాటకు అసలు అర్థం ఏమిటో కూడా తనకు తెలియదని అనుష్క చెప్పుకొచ్చారు. ఆ మాట విన్న వెంటనే ఏం చేయాలో తెలియక అమాయకంగా 'సరే' అని చెప్పేశానని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులో జరిగిన ఆ సంఘటనను ఇప్పుడు తలుచుకుంటే చాలా అమాయకంగా, అందంగా అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. తన బాల్యంలో మిగిలిపోయిన మధురమైన జ్ఞాపకాల్లో అదొకటని చెప్పడంతో.. అనుష్క అభిమానులు కూడా ఈ విషయాన్ని ఆసక్తిగా షేర్ చేస్తున్నారు. అనుష్క వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో రకరకాల వార్తలు, ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె వివాహం ఎప్పుడు జరుగుతుంది.? ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు.? అనే ప్రశ్నలు అభిమానుల్లో చాలాకాలంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అదే సమయంలో ఓ పాన్ ఇండియా హీరోతో అనుష్కకు ప్రేమ సంబంధం ఉందంటూ గతంలో పలు సందర్భాల్లో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అలాంటి ప్రచారాలపై ఇద్దరూ పలుమార్లు స్పందిస్తూ తాము మంచి స్నేహితులమని స్పష్టం చేసిన సందర్భాలు ఉన్నాయి. సినిమాల్లోకి రాకముందు అనుష్క ముంబైలో యోగా శిక్షకురాలిగా పనిచేశారు. ఆ సమయంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ దృష్టిలో పడటంతో.. నాగార్జున హీరోగా తెరకెక్కిన 'సూపర్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత వరుస సినిమాలతో దూసుకుపోతుంది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737